# మూడు రకాల జీవితాలు



రచన :
బ్రహ్మర్షి
తటవర్తి వీరరాఘవరావు

# మూడు రకాల జీవితాలు



రచన & ప్రచురణ : బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు

మొదటి ముద్రణ : నవంబరు, 2025
ప్రతులు : 2,000

వెల : రూ.40/-

పుస్తకముల కొరకు :-
**తటవర్తి వీరరాఘవరావు,**
తటవర్తివారి వీధి, భీమవరం - 534 201.
సెల్ : 94901 71853, 9440309812

## తటవర్తి రాజ్యలక్ష్మి గారి రచనలు

| | | |
|---|---|---|
| 1) మరోజన్మ | - | రూ.160/- |
| 2) సాధనలో స్థితులు | - | రూ.80/- |
| 3) జ్ఞానమాల | - | రూ.70/- |
| 4) దత్తాత్రేయుని 24 మంది గురువులు | - | రూ.70/- |
| 5) బుద్ధుని సూక్తులు | - | రూ.70/- |
| 6) జీవిత పరమార్థం | - | రూ.70/- |
| 7) అవిద్య అంటే? | - | రూ.70/- |
| 8) బుద్ధుని పంచశీలాలు | - | రూ.70/- |
| 9) మనసుకు వున్న మూడు దోషాలు | - | రూ.60/- |
| 10)గురుపౌర్ణమి విశిష్ఠత | - | రూ.60/- |
| 11) మానవుడు యోగిగా ఎదగాలంటే? | - | రూ.60/- |
| 12) ఏది సరైన సాధన? | - | రూ.60/- |
| 13) పంచకోశాలు | - | రూ.60/- |
| 14) మానవుని కర్తవ్యాలు | - | రూ.50/- |
| 15) చిత్తవృత్తులు ఎలా ఏర్పడతాయి? | - | రూ.50/- |
| 16) ప్రీతి,భీతి, నీతి | - | రూ.40/- |

## YouTube ఛానెల్‌లో ప్రసారమయ్యే తటవర్తి దంపతుల కార్యక్రమాలు

a) Channel Name : Tatavarthy Veera Raghava Rao. ఇందులో 2500 పైగా వీడియోలలో తటవర్తి దంపతుల సందేశాలు ఇవ్వడం జరిగింది.

b) అలాగే PMC వారు కూడా బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు గారి యొక్క YouTube Channel ప్రారంభించారు. Channel Name : Brahmarshi Tatavarthy Veera Raghavarao

c) తటవర్తి దంపతుల దగ్గర ట్రైనింగ్ అయిన మాస్టర్ల సందేశాల కొరకు Tatavarty Spiritual Trainees ఛానెల్‌లో చూడండి.

d) Direct గా YouTube app లోకి వెళ్ళి search bar లో Tatavarthy Veera Raghava Rao అని టైపు చేస్తే తటవర్తి దంపతుల అన్ని వీడియోలు చూడవచ్చు.

# మూడు రకాల జీవితాలు

మానవుడికి మూడు రకాల జీవితాలు ఉంటాయి. ఈ మూడూ కూడా మానవుని యొక్క జ్ఞాన పరిధిని సూచించేవే. మరి ఈ మూడు రకాల జీవితాలు జీవించే వారి గురించి చెప్పుకుందాం. అసలు ఏమిటి ఆ మూడు రకాలు? 1) రాత్రి జీవితం, 2) సంధ్యా జీవితం, 3) పగటి జీవితం

**1) రాత్రి జీవితము :**

రాత్రి జీవితము అంటే పూర్తిగా అజ్ఞానంతో ఉన్నటువంటి జీవితం. అందుకే అజ్ఞానాన్ని చీకటితో పోలుస్తారు. చీకట్లో ఉన్నవి ఎలా కనిపించవో, అజ్ఞానంలో ఉన్నవారికి ఉన్నవి కనిపించవు అంటే తెలియవు. విచిత్రం ఏమిటంటే? అజ్ఞానంలో ఉన్న వారికి ఉండనివన్నీ కనిపిస్తూ ఉంటాయి.

అందుచేత వీరికి ఏమీ తెలియదనే అనుకోవచ్చు. ఏం చేయాలో తెలియదు, చేయకూడనివన్నీ చేస్తూ ఉంటారు. ఏం మాట్లాడాలో తెలీదు. అందుచేత వ్యర్థమైనవి, మాట్లాడకూడనివి, విరుద్ధమైనవి మాట్లాడతారు. అలాగే ఏమి ఆలోచించాలో కూడా తెలీదు. వారు ఆలోచించేవన్నీ వారికి నష్టం కలిగించేవే ఆలోచిస్తారు.

ఎందుచేతనంటే మనం చెప్పేది అజ్ఞానంలో ఉన్న వాళ్ళకి అర్థం కాదు. ఉండేది వాళ్ళకి కనిపించదు. ఉండేది ఏమిటి? అంటే ఆత్మ. ఆత్మ వీళ్ళకి కనిపించదు, ఆత్మ ఉండే లోకాలూ కనిపించవు, ఆ లోకాల్లో ఉండేవారూ కనిపించరు. ఈ సృష్టి నడవడానికి ఏర్పాటు చేయబడిన సిద్ధాంతాలు కనిపించవు, ధర్మాలు తెలియవు, వాడు చేసిన కర్మలు రికార్డు అవుతాయని, వాటి ఫలితమే కష్టాల రూపంలో అనుభవిస్తున్నాను అన్న సంగతి కూడా తెలియదు.

అందుచేత ఈ రాత్రి జీవితం జీవించే వారికి ఈ జ్ఞానం లేకపోవడం వల్ల, అజ్ఞానంలో ఉండడం వల్ల అంతా వేరు వేరు అనుకుంటూ ఏం చేయాలో తెలియక చేయకూడనివి చేస్తారు.

ఇది మీకు పగటి జీవితంలోకి వస్తే అంటే జ్ఞాన జీవితంలోకి వస్తే కానీ అర్థం కాదు. జ్ఞానులు అయితే గానీ అంతా ఆత్మలే, అంతా ఒకటే అని అర్థమవ్వదు. ఈ రాత్రి జీవితంలో ఉండడం వల్ల అంటే అజ్ఞానంలో ఉండడం వల్ల అంతా వేరు వేరు అనే భావంతో ఉంటూ తన స్వార్థం చూసుకుంటూ, ఇతరులు ఏమైపోయినా పర్వాలేదు అనుకుంటూ, చేయకూడని పనులు చేస్తారు.

అందుకే ఏం చేయాలో తెలియదు, ఏం మాట్లాడాలో తెలీదు అని చెప్పుకున్నాం. ఊరికే వ్యర్థంగా మాట్లాడతారు, విమర్శిస్తూ ఉంటారు, దూషిస్తూ ఉంటారు, అవమానిస్తారు. అలా చేయడం వల్ల ఈ రాత్రి జీవితం జీవించే వారికి కష్టాలు ఎక్కువ ఉంటాయి. ఈ రాత్రి జీవితంలో ఉన్నవాళ్ళు అంటే అజ్ఞానంలో ఉన్నవాళ్ళు ఎంతసేపు ఉండని వాటిని పెంచుకోవాలని చూస్తారు. అవే సంపాదించుకోవాలి అనుకుంటారు. అవి ఏవైనా పొందితే చాలా అదృష్టవంతుడ్ని అనుకుంటారు, పొంగిపోతారు.

ఎవరైనా ఒక బిరుదు ఇచ్చినా, అవార్డు ఇచ్చినా ఏదో తాను చాలా గొప్ప పని చేసినట్టుగా పొంగి పోవడమే కాదు, గర్విస్తారు కూడా. ఎంతసేపు అలాంటివి సంపాదిస్తేనే గొప్పవాళ్ళయినట్టుగా భావిస్తారు, ఇలాంటి వారంతా రాత్రి జీవితాన్ని జీవిస్తున్న వారు. అందుచేత అన్ని విషయాల్లో వీరి ప్రవర్తన పూర్తిగా ఆత్మ విరుద్ధంగా ఉంటుంది.

ఎందుకంటే ఈ రాత్రి జీవితం జీవించే వారికి ఆత్మ ఉన్నా కనిపించదు. అందుకే ఆత్మను పట్టించుకోరు, ఆత్మ గురించి ఆలోచించరు, ఆత్మ గురించి తెలుసుకునే ప్రయత్నం చేయరు, ఆత్మ గొప్పతనాన్ని తెలుసుకోరు, ఆత్మ ఉన్నతికి కృషి చేయరు. అందుచేత వీరు చేసే పనులు వల్ల ఆత్మకు లాభం కలగదు, జీవితం చివరిలో ఆత్మ గురించి తెలుసుకుని ఎంతో బాధపడతారు.

అరే ఎంత జీవితాన్ని వృధా చేసుకున్నాను. అన్నీ చేయకూడని విరుద్ధమైన పనులే చేశాను, తినకూడనివి తిన్నాను, జీవితాన్ని ఎంతో నష్ట

పెట్టుకున్నాను అని అర్థమవుతుంది.

ఈ రాత్రి జీవితం జీవించే వారు ఈ దేహం నేను అనుకుంటారు, తాను ఆత్మ అన్న సంగతే తెలీదు. చనిపోయిన తర్వాత కూడా నాకు ఇంకా జీవితం ఉంటుంది అన్న సంగతి తెలీదు, చనిపోయిన తర్వాత ఉండే లోకాల గురించి తెలీదు, ఆ లోకాల్లో ఉన్నత లోకాలు చేరుకోవాలన్న సంగతి తెలీదు, తన లక్ష్యమేమిటో తెలియదు, తన గమ్యం ఏమిటో తెలియదు. ఏమీ తెలియకపోవడం వల్ల తాను దేహం అనుకొని చెయ్యకూడని పనులు చేసి ఆత్మకు నష్టం కలిగిస్తారు. అంటే తనకు నష్టం కలిగించుకుంటారు, అవి కష్టాలకు కూడా గురిచేస్తాయి.

నా జీవితంలో కూడా 53 సంవత్సరాలు అలాగే గడిచిపోయింది. అంటే పత్రి గారి పరిచయం కాకముందు రాత్రి జీవితమే గడిపాను. అప్పటివరకు గొప్పగా జీవించాను అనుకున్నాను, గొప్ప పనులు చేశాను అనుకున్నాను. కానీ పత్రి గారి ద్వారా నేను దేహం కాదు ఆత్మ అని తెలుసుకున్నాను, ఆశ్చర్యపోయాను.

అప్పుడు ఆలోచిస్తే పత్రి గారు చెప్పింది కరెక్టు అన్నది అర్థమైంది. అప్పుడు రాత్రి జీవితంలోనుంచి పగటి జీవితంలోకి రావడం జరిగింది. నా పనులు, నా మాటలు, ఆలోచనా విధానం అన్నీ మారిపోయాయి. రాత్రి జీవితానికి పగటి జీవితానికి నా ప్రవర్తన పూర్తి భిన్నంగా మారిపోయింది. ఒక రకంగా చెప్పాలంటే మీలో చాలామంది రాత్రి జీవితంలో నుంచి పగటి జీవితంలోకి వచ్చారు, కానీ కొంతమంది సంధ్యా జీవితంలో ఉండిపోయారు.

**2) సంధ్యా జీవితం :**

ఒక రోజులో మూడు దశలు ఉంటాయి. రాత్రి, పగలు, సంధ్య. ఇక్కడ మానవుని యొక్క జ్ఞాన పరిధిని ఈ మూడు రకాలతో పోల్చడం జరిగింది.

మనం గమనిస్తే రాత్రి అయినప్పుడు పూర్తిగా చీకటిగా ఉంటుంది. అదే పగలు పూర్తి వెలుగుతో ఉంటుంది. కానీ ఈ రెండిటికీ మధ్యలో సంధ్య

కూడా ఉంది. దాన్నే సంధ్యా సమయం అన్నారు. ఈ సంధ్య రెండు రకాలు.

ఎ) రాత్రి సంధ్య, బి)పగలు సంధ్య

ఇక్కడ గమనించినట్లయితే పగలు ఉన్నటువంటి వెలుగు అలా శాశ్వతంగా ఉండిపోతుందా? అంటే శాశ్వతంగా ఉండదు, మెల్లిగా రాత్రిగా మారిపోతుంది, వెలుతురు పోయి చీకటిగా మారిపోతుంది. అలా రాత్రిగా మారిపోయే సమయాన్నే రాత్రి సంధ్య అంటారు.

అలాగే చీకటి కూడా శాశ్వతంగా ఉండదు. ఆ చీకటి మెల్లిగా పోతూ వెలుగు వస్తుంది, అంటే అక్కడ కూడా చీకటి మెల్లిగా వెలుగుగా మారిపోతుంది. మెల్లిగా పగలుగా మారిపోతుంది. ఇదే పగటి సంధ్య.

మరి ఎందుకు కొంతమందిని ఈ రెండిటికీ మధ్యలో మార్పు జరిగే ఈ సంధ్యా జీవితంతో పోల్చారు అంటే? అజ్ఞానంలో ఉన్నవారు మెల్లి మెల్లిగా ఎన్నో జన్మలు తీసుకుంటూ, ఆ జన్మల్లో ఎన్నో రకాల అనుభవాలు పొందుతూ, కష్టాలు అనుభవిస్తూ చివరికి నేను వీటిలో నుంచి శాశ్వతంగా బయట పడాలి అని నిర్ణయించుకుంటారు. ఈ బాధలో నుంచి ఏలాగైనా బయట పడాలి అనేటటువంటి నిర్ణయానికి వస్తారు. దానికోసం ఒక సద్గురువుని ఆశ్రయిస్తారు.

అలా సద్గురువుని ఆశ్రయించినప్పుడు ఆ గురువు వారికి నువ్వు దుఃఖం నుంచి శాశ్వతంగా బయట పడాలి అంటే నువ్వు జ్ఞానం సంపాదించు కోవాలి, జ్ఞానివి కావాలి అని స్పష్టంగా చెప్తారు. జ్ఞానం పొందితే నీకు దుఃఖం ఉన్నా దుఃఖం వున్నా దుఃఖపడవు, ఆ జ్ఞానం వల్ల నీ కర్మలన్నీ దగ్ధమైపోతాయి, కర్మలు లేని స్థితి నీకు వస్తుంది. అటువంటి జ్ఞానం నువ్వు సంపాదించుకోవాలి అంటే  ఆధ్యాత్మిక త్రిరత్నాలు పాటించాలి అని చెప్తారు.

ఆధ్యాత్మిక త్రిరత్నాలు అంటే సాధన, స్వాధ్యాయం, సాంగత్యం. అంటే

1) శ్వాస మీద ధ్యాస ఉంచి తీవ్రంగా ధ్యానం చేయడం.

2) స్వాధ్యాయము అంటే ఆత్మజ్ఞానులు వ్రాసిన ఆత్మజ్ఞానానికి

సంబంధించిన పుస్తకాలు కూడా చదువుతూ ఉండడం.

3) ఈ జ్ఞానాన్ని బోధించే వారితో సాంగత్యం చేస్తూ.. వారి సందేశాలు వినడం. అవకాశం దొరికినప్పుడు వారితో గడపడానికి ప్రయత్నించడం. వారితో అలా గడుపుతున్నప్పుడు మీకు తెలియని ఎన్నో విషయాలు వారి నుంచి తెలుసుకోగలుగుతారు. మీ లోపాలను, మీ తప్పులను సరి చేసుకుంటారు. ఆ గురువు నుంచి వచ్చే ప్రతి మాట మీ జ్ఞానాన్ని పెంచడానికి ఎంతో ఉపయోగపడుతుంది.

అలాగే ఈ జ్ఞాన మార్గంలో మీరు చేయగలిగినంత సేవ చేయాలి. అంటే జ్ఞానం సంపాదించుకోవడమే కాదు, మీరు సంపాదించుకున్న జ్ఞానాన్ని వీలైనంత వరకు అవకాశం ఉన్నంతవరకు ఇతరులకి బోధిస్తూ ఉండాలి. ఇదే అద్భుతమైన సేవ, అన్నిటికంటే గొప్ప సేవ. దానితో పాటు ఈ జ్ఞానం అందరికీ అందడానికి మీరు మీ స్థాయిలో ఏది చేయగలిగినా అది చేస్తూ ఉండాలి.

ఇలా అజ్ఞానంలో ఉన్నవారి అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానవంతుల్ని చేయడానికే ఏదో ఒక విధంగా మనం సహాయపడగలగాలి అని గురువులు చెప్తారు. అలా అజ్ఞానంలో ఉన్నవారు పత్రిగారి మార్గంలోకి, నా దగ్గరికి, అమ్మ దగ్గరికి వచ్చి జ్ఞానం పొందుతూ ఉండడంవల్ల వారిలో ఎన్నో మార్పులు వస్తున్నాయి. ఇంకా రావల్సినవి ఎన్నో ఉన్నాయి. అంటే ఇలా ఉన్నవాళ్ళంతా సంధ్యా జీవితంలో ఉన్నట్టే. వీళ్ళందరిదీ సంధ్యా జీవితమే.

అంతేకాదు ఆ గురువులు బోధించిన ఆ జ్ఞానం వీళ్ళకి పూర్తిగా అర్థం కాదు. అర్థమయ్యీ, అర్థమవనట్టుగా ఉంటుంది. వీరి జీవితం ఎలా ఉంటుందంటే? కొంతమంది ఎలా అయితే తాడుని చూసి పాము అనుకుంటారో, అది తాడో? పామో? స్పష్టంగా తెలియక గందరగోళ పడతారో! అలా ఈ సంధ్యా జీవితంలో ఉన్న వాళ్ళకి ఆ గురువులు చెప్పినటువంటి జ్ఞానపరమైన విషయాలు అర్థం కాక అవి సరైనవా? కావా? నా దుఃఖాన్ని

పూర్తిగా తొలగించగలవా? నేను అనుకున్న స్థాయికి నేను వెళ్ళగలనా? లేదా? అనే అనుమానం తో ఉంటారు.

అందుచేత ఇలాంటి వారిలో కొంతమంది వారు చేసే సాధన మీదా, పాటించవలసిన నియమాల మీదా, ఆచరించవలసిన దానిమీద దృష్టి ఉంచకుండా నేను అనుకున్నది జరగలేదేమిటి? అనే అపోహతో ఇంకొక గురువుని ఆశ్రయిస్తారు.

ఇలాంటి వాళ్ళు పూర్తి సంధ్యా జీవితంలో ఉన్నట్టు. అదే నేను పొందుతాను, నేను సాధిస్తాను అనే నమ్మకంతో సాధన తీవ్రంగా కొనసాగిస్తూ ఉంటే వాళ్ళు ఈ సంధ్యా జీవితం నుంచి బయట పడుతున్న వాళ్ళ క్రింద మనం లెక్కేయొచ్చు.

ఎందుచేతనంటే చాలామంది ఈ ధ్యాన మార్గంలోకి వస్తారు. అక్కడ గురువు, విగ్రహం దేవుడు కాదు, ఆత్మే దేవుడు అని చెప్తారు. కానీ చిన్ననాటి నుంచి పూజలు చేయడం వల్ల, అది అలవాటు అయిపోవడం వల్ల, అందరూ అదే చేస్తూ ఉండడం వల్ల, అది మానేస్తే ఏమవుతుందో అనే భయంతో, విగ్రహం దేవుడు కాదు అని గురువు చెప్పినా అది స్పష్టంగా అర్థం కాక పూజలు మానలేరు. వీళ్ళు సంధ్యా జీవితంలో ఉన్నట్లు లెక్క.

అలాగే ఆ గురువులు మాంసం తినకూడదు అని చెప్తారు. కానీ వీళ్ళు చిన్ననాటి నుంచి మాంసం తినే అలవాటు ఉండడం వల్ల, దాని రుచికి బాగా అలవాటు పడిపోవడం వల్ల, తన కుటుంబంలో వారు, చుట్టుపక్కల వాళ్ళు అందరూ అదే తింటూ ఉండడం వల్ల, డాక్టర్లు, ఇంకా కొంతమంది పెద్దలూ బలం అని చెబుతూ ఉండడం వల్ల గురువు చెప్పినా కూడా వాళ్ళకి స్పష్టంగా అర్థం కాక మానలేరు. ఇటువంటి వారు సంధ్యా జీవితంలో ఉన్నట్టే లెక్క.

అలాగే ఆ గురువులు నువ్వు జ్ఞానం సంపాదించాలి అంటే సత్యం తెలుసుకోవాలి అని చెప్తారు. ఏమిటంటే ఈ దేహం నువ్వు అనే భావంతోటే

జీవిస్తున్నావు. నువ్వు చేసే పనులన్నీ దేహం కోసమే చేశావు. కానీ నువ్వు దేహం కాదు, నువ్వు ఆత్మవు అని చెప్తారు. ఇక నుంచైనా ఆత్మ లాభాల కోసం ప్రయత్నించు, ఆత్మ కోసం జీవించు అని ఆత్మకు లాభించే జ్ఞానం ఎలా పొందాలో చెప్తారు.

కానీ వాళ్ళకి ఇది స్పష్టంగా అర్థం కాకపోవడం వల్ల ఎంత నువ్వు ఆత్మ అని చెప్పినా.. నేను దేహం అన్నట్టుగానే జీవిస్తూ ఉంటారు. దేహానికి ప్రాముఖ్యం ఇస్తారు, దేహ లాభాలకే కృషి చేస్తూ ఉంటారు. విన్నప్పుడు కరెక్టే అనుకుంటారు. మళ్లీ దేహం అనే భ్రాంతిలో పడిపోతారు ఇది కూడా సంధ్యా జీవితం యొక్క లక్షణమే. అంతేకాదు కొన్ని ఆచరించగలుగుతారు, కొన్ని ఆచరించలేకపోతారు. ఇది కూడా సంధ్యా జీవితమే! పూర్తిగా మార్పు వచ్చినప్పుడే వారు పగటి జీవితంలోకి వచ్చినట్టు.

మీరు చూడండి 23 సంవత్సరాల క్రితం పత్రి గారి పరిచయం కాక ముందు నేను వెంకటేశ్వర స్వామికి వీరభక్తుడిని. అందరూ గుళ్ళకు వెళ్లి పూజలు చేసి వస్తూ ఉంటారు, మొక్కులు మొక్కుకుంటూ ఉంటారు. కానీ నేను స్వయంగా వెంకటేశ్వర స్వామి మందిరమే నిర్మించడం జరిగింది, అంటే అంత వీరభక్తుడ్ని. చిన్ననాటి నుంచి ప్రతి సంవత్సరం ఇంచుమించు ఒక్కసారో, రెండుసార్లో తిరుమల వెళ్లి వచ్చేవాడ్ని.

అంత భక్తిలో మునిగిపోయి ఉన్న నాకు పత్రి గారు ఒకసారి విగ్రహం దేవుడు కాదు అన్నారు, మతి లేదు. పత్రి గారు చెప్పినవన్నీ సహజంగా సమాజంలో చేస్తున్న దానికీ, ఆచరిస్తున్న దానికీ పూర్తి విరుద్ధంగా ఉంటాయి. గమ్మున ఎవరూ ఒప్పుకునేవారు కాదు. కానీ నేను నమ్మకపోవడము అంటూ ఉండేది కాదు. అంత గొప్పవాడు చెప్తున్నాడు అంటే ఇందులో ఏదో ఉంటుందనే ఉద్దేశ్యంతో వాటి గురించి బాగా అధ్యయనం చేశాను. ఏ విషయాలు అయితే ఇప్పుడు విరుద్ధంగా కనిపిస్తున్నాయో వాటి గురించి ఎంతో అధ్యయనం చేశాను.

నేను వ్రాసినటువంటి పుస్తకాలన్నీ కూడా అందులో తెలుసుకున్నవే.

ఆ పుస్తకాలన్నీ చదివితే మీ సందేహాలు పూర్తిగా నివృత్తి అయిపోతాయి. అలా ఎన్నో పుస్తకాలు, ఉపనిషత్తులు చదివితే అర్థమైంది. ఉపనిషత్తులో, వేదాల్లో ఆత్మే దేవుడని చెప్పబడింది కానీ ఎక్కడా విగ్రహం ప్రస్తావన లేదు.

అన్నమాచార్యులు చెప్పలేదా? చేయలేదా? భక్తుడు కాదా? అంటారు. అన్నమాచార్యులే స్పష్టంగా చెప్పారు. బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే అని, ఆయన నీ అంతరంలోనే ఉన్నాడు అని చెప్పాడు. అందరికీ ఆ శ్రీహరే అంతరాత్మ అని చెప్పాడు. అప్పుడు ఇంకా బాగా అర్థమై ధైర్యం కూడా వచ్చింది. అప్పటినుంచి నేను తిరుమల వెళ్ళలేదు. ఎందుకంటే ఆ శ్రీహరి కోసం తిరుమల ఏడాదికి ఒక్కసారే వెళ్ళేవాడిని కానీ ఇప్పుడు ఈ సత్యం అర్థమైన తర్వాత ప్రతీరోజు గంటలు గంటలు ఆయన మీద దృష్టి ఉంచుతున్నాను.

అలా నేను మొదట... రాత్రి జీవితంలో ఉన్నా, మెల్లిగా సంధ్యా జీవితం లోకి, ఆ తర్వాత కృషి చేత  పగటి జీవితంలోకి కూడా రావడం జరిగింది.

కానీ చాలామందికి ఇంకా సందేహమే, ఇంకా భయమే, దీపమైనా పెట్టాలి కదండీ అంటారు.

ఇలా సంధ్యా జీవితంలో జ్ఞానం పొందుతారు. జ్ఞానం మీద ఆసక్తి ఉంది. కానీ ఆ జ్ఞానం గురించి చెప్పిన విషయాలు పూర్తిగా అర్థం కాకపోవడం వల్ల లేదా భయం వల్లా ఆచరణ ఉండదు. అందుచేత తెలుసుకున్నా ఫలితం పొందలేకపోతారు. అన్నీ తెలుసు, కానీ ప్రవర్తనలో మార్పు రాదు. మరి తెలిసున్నా కూడా ఆచరించకపోతే, మార్పు తెచ్చుకోకపోతే సంధ్యా జీవితంలో ఉన్నట్టే.

అందుచేత వివేకం ఉన్నవారు సద్గురువులు చెప్పినప్పుడు తీసి పడేయకండి. మీకు ఇంకేమైనా సందేహాలు ఉంటే వాటిని నివృత్తి చేసుకునే ప్రయత్నం చేయండి. ఎంతో మంది యోగులు, మహానుభావులు, మహర్షులు వాళ్ళ జీవితాన్ని వెచ్చించి ఎన్నో సత్యాలు తెలుసుకొని ఎన్నో గ్రంథాలలో

అందించారు. భగవద్గీత కానీ, యోగ వాశిష్టం కానీ, ఇవన్నీ మీరు బాగా అధ్యయనం చేస్తే సంధ్యా జీవితం నుంచి కూడా బయటపడి పగటి జీవితంలోకి వస్తారు.

**3) పగటి జీవితం :**

పగటి జీవితం అంటే ఇది పూర్తిగా జ్ఞానం పొందినవారి జీవితం. మీరు పూర్తి జ్ఞానులైతే గురువు చెప్పిన విషయాల మీద శ్రద్ధ చూపిస్తారు, శ్రద్ధగా వింటారు, వ్రాసుకుంటారు, మననం చేసుకుంటారు. అలా మననం చేసుకోవడం వల్ల అర్థం కూడా చేసుకుంటారు, అర్థం చేసుకుని ఆచరిస్తారు.

అందుచేత వీరు పూర్తి జ్ఞానులై చేయవలసిందే చేస్తారు, మాట్లాడ వలసిందే మాట్లాడతారు, ఆలోచించవలసిందే ఆలోచిస్తారు. శ్రద్ధగా గురువుని అనుసరించడం వల్ల, ధ్యాన సాధన తీవ్రంగా చేయడం వల్ల, వీరి జ్ఞానం అపారంగా పెరుగుతుంది, అగ్నిలా ప్రజ్వరిల్లుతుంది. అటువంటి జ్ఞానాగ్నిలో వీరు కర్మలను కూడా దగ్ధం చేసుకుంటారు, ముక్తిని, మోక్షాన్ని కూడా పొందుతారు.

ఈ మూడు రకాల వారి గురించి పత్రీజీ ఏమన్నారంటే! అజ్ఞుడు, అల్పజ్ఞుడు, విజ్ఞుడు అన్నారు. అజ్ఞుడు అంటే రాత్రి జీవితం జీవించేవాడు, అల్పజ్ఞుడు అంటే సంధ్యా జీవితం జీవించేవాడు, విజ్ఞుడు అంటే పగటి జీవితం జీవించేవాడు.

మరి పత్రీజీ అజ్ఞానంలో ఉన్నవారి గురించి, పూర్తిగా జ్ఞానం పొందని వారి గురించి అలాగే విశేషంగా జ్ఞానం పొందిన వారి గురించి చెప్పడం జరిగింది. అందుచేత ఆయన ఇచ్చినటువంటి వివరణ తెలుసుకుంటూ దాన్ని ఇంకా మనం లోతుగా విశ్లేషించుకుందాం. ఆయన ఏమన్నారంటే ?

1) అజ్ఞుడు అంటే అజ్ఞానంలో ఉన్నవాడు. ఈ శరీరమే నేను అన్నట్టుగా జీవించేవాడు. శరీర సుఖాల కోసమే జీవితం అన్నట్టుగా జీవించే వాడు.

2) అల్పజ్ఞుడు అంటే కొన్ని తెలుసుకుంటారు. అంటే ఈ శరీరం నేను కాదు, ఆత్మే నేను అన్నది తెలుసుకుంటారు. తెలుసుకున్నా ఈ శరీరమే నేను అన్నట్టుగా జీవిస్తారు.

పత్రి గారు పరిచయం కాకముందు మా జీవితాన్ని, పరిచయం అయ్యాక మా జీవితాన్ని గమనించుకుంటే పూర్తిగా మారిపోయింది. మా కుటుంబ సభ్యులు, స్నేహితులు, పరిచయస్తులే కాదు అందరూ ఆశ్చర్యపోయే విధంగా మాలో మార్పు వచ్చింది. మరి ఎందుకు అలా మారిపోయిందంటే? పత్రి గారు పరిచయమైనప్పుడు ఆయన ఏమన్నారంటే నువ్వు దేహం కాదు అన్నారు.

ఇదేంటి? ఈ దేహానికి ఒక పేరు పెట్టుకున్నాను, ఆ పేరుకి పేరు రావాలని ఎంతో తాపత్రయ పడుతున్నాను. అటువంటి ఈ దేహం నేను కాదంటాడేమిటి ఈయన? అని ఆశ్చర్యపోయాను! మరి నేను ఎవరు? అని అడిగాను.

అప్పుడు ఆయన నువ్వు ఆత్మవయ్యా అన్నారు, ఇంకా ఆశ్చర్యం వేసింది, ఆత్మ అన్నది ఎప్పుడూ వినలేదు. ఆయన చెప్పింది ఎంతవరకు కరెక్ట్ అని ఎన్నో పుస్తకాలు చదివి, గొప్పవాళ్ళ వీడియోలు విని పత్రి గారు చెప్పింది సత్యము అని తెలుసుకోగలిగాను. అప్పుడు నా ఆలోచనా విధానం మారి పోయింది.

విచారణ ద్వారా నేను దేహం కాదు ఆత్మ అని నిర్ధారించుకున్నాను. మరి ఆత్మైన నేను ఇన్నాళ్ళు దేహానికి ఇంత ప్రాముఖ్యం ఇచ్చాను, దేహాన్ని సుఖ పెట్టడం కోసం రాత్రీ పగలూ కష్టపడి ఇంత డబ్బు సంపాదించాను, దీన్ని ఏసీలో పడుకోబెట్టి నాకంటే అదృష్టవంతుడు లేడు అని భావించాను, రకరకాల పదార్థాలు తినిపించి దీన్ని ఎంతో తృప్తి పరిచానని అనుకుని తృప్తి పడ్డాను.

ఈ శరీరానికి పొగడ్తలు రావాలని ఎన్నో పనులు చేశాను. దీన్నింకా

సుఖ పెట్టాలని పుణ్య కర్మలు కూడా చేశాను. అలా జీవితమంతా ఈ దేహం కోసమే కష్టపడ్డాను. కష్టపడ్డాను అంటే ఈ దేహాన్ని సుఖపెట్టడం కోసం మళ్ళీ ఈ దేహాన్నే కష్టపెట్టాను, ఇది చాలా విచిత్రం.

ఎప్పుడో రాత్రి కాసేపు ఏసి వేసుకుని పడుకోవడానికి, ఆ కాస్త సుఖం దేహానికి ఇవ్వడానికి పొద్దుట్నుంచి సాయంకాలం దాకా దేహాన్ని కష్టపెట్టాను.

ఎవరైనా అంతే. సంపాదించేవాళ్ళు సంపాదిస్తున్నారు, వ్యాపారం చేసేవాళ్ళు వ్యాపారం చేస్తున్నారు, ఉద్యోగం చేసేవాళ్ళు ఉద్యోగం చేస్తున్నారు. ఇంకా ఆడవాళ్ళైతే ఇంటి పనులూ చేస్తున్నారు, ఉద్యోగాలూ చేస్తున్నారు. ఇదంతా ఎందుకు చేస్తున్నారు? ఎందుకు కష్టపడుతున్నారు? అంటే ఈ దేహాన్ని సుఖ పెట్టడం కోసమే.

చాలామంది అమెరికా వెళ్తే సౌకర్యాలు ఎక్కువ ఉంటాయి, బాగా సుఖపడొచ్చు అనుకుంటారు. పాపం ఇండియాలో ఉంటే పని మనిషి దొరుకు తుంది. ఆ ఇల్లు ఊడ్చడం, అంట్లు తోమడం పనివాళ్ళు చేసి పెడతారు. కానీ అమెరికా కుర్రోడు అని కోట్లు కట్నం ఇచ్చి పెళ్ళి చేస్తే అక్కడికి వెళ్ళి వాళ్ళు చేసే పని ఏమిటంటే! ఇల్లు ఊడ్చుకోవడం, టాయిలెట్లు కడగడం, వంటంతా వండుకోవడం, బజార్లోకి వెళ్ళి అన్నీ వాళ్ళే తెచ్చుకోవడం చేస్తారు. ఇది ఏం సుఖమో అర్థం కాదు.

అమెరికా సంబంధమని ఎగబడతారు. ఏదైతే ఏంటి ఇక్కడున్నా కష్టపడుతున్నారు, అక్కడికి వెళ్ళినా కష్టపడుతున్నారు. మరి అలా దేహాన్ని సుఖపెట్టడం కోసం మళ్లీ దేహాన్నే కష్టపెడుతున్నారు. అందుకే వశిష్టుల వారు అన్నారు, సుఖం గోరంత, కష్టాలు కొండంత అని.

కష్టాలు అంటే ఏదో రోగం రావడం వల్లా, సమస్యలు రావడం వల్లా పడే కష్టాలు కాదు. రోజు వారి పనులు చేసుకున్నా కూడా ఎంతో కష్టపడవలసిందే. మరి పిల్లలు ఉంటే వాళ్ళ మీద కూడా దృష్టి పెట్టాల్సి

వస్తుంది. వాళ్ళని పెంచడం, ప్రయోజకుల్ని చేయడం ఎంత కష్టం! వాళ్ళని చదివించడం, స్కూల్స్ లో దింపడం ఒక మిషన్లా పని చేయాలి.

పోనీ అంత కష్టపడి, అన్ని పాట్లు పడుతూ, అంత సుఖ పెట్టిన దేహం నువ్వా అంటే! అసలు ఆ దేహం నువ్వు కానే కాదు. ఈ దేహం నేను కాదు అని తెలుసుకున్నాక నాలో నేనే ఎన్నో ప్రశ్నలు వేసుకున్నాను.

మరి నేను దేహం కానప్పుడు దేహం కోసం ఇప్పటి దాకా నేను సంపాదించినవి ఏమైనా ఆత్మైన నాకు ఉపయోగ పడతాయా? అని ప్రశ్న వేసుకున్నాను. మీరు కూడా ఈ విధంగా ప్రశ్నలు వేసుకోవాలి. పత్రి గారో, నేనో చెప్పక్కర్లేదు, మీకు మీరు అంతర్మధనం చేసుకోవాలి, మీ వివేకాన్ని ఉపయోగించుకోవాలి. ఆలోచిస్తే ఈ కోట్లలో ఒక్క పైసా కూడా ఆత్మైన నాకు ఉపయోగపడదు అన్నది అర్థమైంది.

అంటే ఇన్నాళ్లు కష్టపడిందంతా వృధాయే అని అర్థమైంది. దేహం కోసమే కాదు, పిల్లల కోసం కూడా కష్టపడ్డాను. తీరా జ్ఞానం పొందాక నీ జీవితాన్ని త్యాగం చేసి పిల్లల కోసం కష్టపడ్డావే! పోనీలే ఆ పిల్లలు నిజంగా నీ పిల్లలా? అంటే వాళ్ళు కూడా నాలా భూమి మీదకు వచ్చినటువంటి ఆత్మలే. వాళ్ళూ ఏదో లోకం నుంచి వచ్చారు, నేను ఏదో లోకం నుంచి వచ్చాను. తరువాత మళ్లీ వాళ్ళూ ఏదో లోకానికి పోతారు, నేనూ ఏదో లోకానికి పోతాను.

ఈ శరీరం వదిలిన తర్వాత వాళ్ళకీ నాకూ సంబంధం ఉండదు. ఇది అర్థమైన తర్వాత జాయింట్ గా ఉన్న ఫ్యామిలీలో ఉన్న మా పిల్లల్ని వేరే పంపేయడం జరిగింది. నా పిల్లలుగా పుట్టి, నాకున్న ఆస్తిలో హక్కు సంపాదించుకున్నారు కాబట్టి, అది వాళ్ళకే చెందుతుంది కాబట్టి, వాళ్ళ వాటా వాళ్ళకిచ్చేసి. నా తదనంతర హక్కు కూడా వాళ్ళదే కాబట్టి నా తదనంతరం వాళ్ళకి చెందేటట్టు వ్రాసి బయటకి పంపేశాను. అలా దేహ బంధాలను వదిలించుకున్నాను.

కనీసం ఇక్కడి నుంచైనా నా గురించి అంటే ఆత్మ గురించి కష్టపడాలి,

ఆత్మకు లాభం కలిగించే పనులు చేయాలి. ఆత్మోన్నతికి పాటుపడాలి అని నిర్ణయించుకుని, వ్యాపారాలన్నీ మానేసి, నాకేవో పదవులు ఉంటే అవి కూడా వదిలేసి పూర్తిగా ఆత్మకు లాభం కలిగించే పనుల మీదే దృష్టి పెట్టాను.

మరి ఆత్మయిన నేను లాభం పొందాలంటే! ఏం చేయాలి? అంటే పత్రి గారు స్పష్టంగా నువ్వు జ్ఞానం సంపాదించుకోవాలి, నీకు లాభించేది జ్ఞానమే అని చెప్పారు. నువ్వు శరీరం వదిలిన తర్వాత, నీ శరీరాన్ని నీ కుటుంబ సభ్యులే బూడిద చేస్తారు, తర్వాత ఉండేది ఆత్మే.

అందరూ భూమ్మీద పాలస్ లాంటి బిల్డింగ్ లోకి వెళ్ళాలని ఎలా అనుకుంటారో, పైకి వెళ్ళినటువంటి ఆత్మలు ఏవైనా సరే ఉన్నతమైనటువంటి లోకాలు చేరుకోవాలనే తపన పడతాయి. అటువంటి లోకాలు ప్రాప్తించాలి అంటే జ్ఞానం సంపాదించుకోవాలి అన్నది అర్థమైంది. భూమ్మీద ధనం సంపాదిస్తే ఎంత గొప్పవాడో, శరీరం ఉండగా జ్ఞానం సంపాదించుకున్నవాడు పై లోకాల్లో అంత గొప్పవాడు అని అర్థం చేసుకున్నాను. ఇప్పుడు రాత్రీ, పగలూ ఆ జ్ఞాన సంపాదనకే జీవితాన్ని వినియోగిస్తున్నాను.

పత్రి గారిని ఆదర్శంగా తీసుకున్నాను. ఆయన ఖాళీ దొరికితే ఏదో ఒక పని చేసేవారు, క్లాసులకి వెళ్ళేవారు, ఎవరెవరు ఏ పనులు చేయాలో అన్నీ పురమాయించేవారు. ఖాళీ దొరికితే ధ్యాన జగత్తు, స్పిరిట్యువల్ ఇండియా పుస్తకాలు కరెక్షన్ చేసేవారు. పుస్తకాలు వ్రాసేవారు. చాలా కాన్సెప్ట్లు రికార్డింగ్ చేసి వీడియోల కింద రిలీజ్ చేసి మనందరికీ అందించేవారు. ఆ పుస్తకాల వల్లా, అవన్నీ వినడం వల్లే కదా ఈ స్థాయికి వచ్చాం, అందుకే అదే పని నేను కూడా చేస్తున్నాను.

జూముల ద్వారా సందేశాలు ఇస్తున్నాను, బయటికి వెళ్ళి క్లాసులు చెప్తున్నాను, ఖాళీ దొరికినప్పుడల్లా పుస్తకాలు కరెక్షన్ చేస్తున్నాను. ఇదంతా ఎందుకు చేస్తున్నాను అంటే? ఆత్మ అయిన నేను నా సమయాన్ని వృధా చేయకుండా ఆత్మ లాభం కోసం ఏదో ఒక పని చేయాలి అన్నదే నా ఉద్దేశ్యము,

ఆశయము.

అందుకే ఆలోచించండి మీకు వచ్చిన ఈ అవకాశాన్ని వ్యర్థం చేయకండి. ఎందుకు వ్యర్థమైన సంభాషణలకు సమయాన్నంతా వృధా చేస్తారు? టీవీలు చూడడం, సెల్లులో కాలక్షేపానికి యూట్యూబ్ చూడడం వల్ల నీకు ఇవ్వబడిన సమయం అంతా వృధా చేసుకున్నట్టే కదా?

దానికి బదులు ఆత్మకు లాభం కలిగించే పనులు చేస్తే, జ్ఞానం పెంచుకునే పనులు చేస్తే జ్ఞానం పెరుగుతుంది. ఇప్పుడు మీరు ఏ సరదాలు తీర్చుకుంటున్నారో! ఏ కోరికలు తీర్చుకుంటున్నారో! అవన్నీ ఇంతకుముందు జన్మల్లో కూడా అనుభవించారు. ఇంతకుముందు జన్మల్లో అన్నీ ఉన్నాయి, భర్త ఉన్నాడు, భార్య ఉంది, పిల్లలు ఉన్నారు, సంసారం ఉంది, సంపాదన ఉంది, సుఖాలు ఉన్నాయి. ఒక్కో జన్మలో కష్టాలు ఉన్నాయి, ఒక్కో జన్మలో భోగాలు ఉన్నాయి, ఇవన్నీ అనుభవించారు. ఇన్ని జన్మలు అనుభవించినా ఇంకా తృప్తి తీరలేదా?

ఒక్కసారి ఆలోచించుకోండి! నేను ఖచ్చితంగా చెప్తున్నాను జూమ్ లోకి వచ్చిన మీరంతా 350 నుంచి 360 జన్మలు దాటిన వారే. ఇంకా మీలో కొంతమంది అంతకన్నా ఎక్కువే ఉంటారు. ఇంకా ఎందుకు ఈ మమకారాలు? అంటే అందరినీ వదిలేయ మంటారా? అన్నీ వదిలేయమంటారా? ఏ బాధ్యతలు చూసుకోవద్దు అంటారా? అని మీరు అనొచ్చు.

అన్నీ చూసుకోండి, నేను వద్దనను. కాని ఉన్న కాస్త ఖాళీ సమయాన్ని మీకు అంటే ఆత్మకి కేటాయించుకోండి, ఆత్మ లాభం కోసం కష్టపడండి, కృషి చేయండి, ఖాళీ సమయాన్ని, వృధా చేయకండి. ఏదైతే నేను ఆచరిస్తున్నానో అదే మీకూ నేర్పిస్తున్నాను. 23 సంవత్సరాల నుంచి నేను ఎంతవరకు చేయగలనో, ఎన్ని చేయగలనో, ఎన్ని రకాలుగా చేయగలనో, అన్నీ చేస్తూనే ఉన్నాను. నాతో పాటు మీ అందరూ ఆత్మలే కాబట్టి, మీరూ జ్ఞానం సంపాదించుకోవాలి కాబట్టి, పైకి వెళ్ళిన తర్వాత మీరు లాభం పొందాలి

కాబట్టి, ఉన్నత లోకాలు చేరుకోవాలి కాబట్టి, మిమ్మల్ని ప్రోత్సహిస్తున్నాను, మీ ఆత్మ బాధ్యత గుర్తు చేస్తున్నాను.

ఇక్కడ రెండు బాధ్యతలు ఉన్నాయండి, దేహ బాధ్యత, ఆత్మ బాధ్యత. పత్రి గారు రెండింటినీ బ్యాలెన్స్ చేయమన్నారు. దేహ బాధ్యత అంటే సంసారాన్ని చూసుకోవాలి, పిల్లల్ని చూసుకోవాలి, సంపాదించుకోవాలి. స్త్రీలు అయితే భర్తను చూసుకోవాలి, పురుషుడు అయితే భార్యను చూసుకోవాలి, తల్లిదండ్రులు ఉంటే వాళ్ళని చూసుకోవాలి, ఇవన్నీ దేహ బాధ్యతలు.

ఆత్మ బాధ్యత  అంటే జ్ఞానం సంపాదించుకోవాలి. జ్ఞానము అంటే మన కంటికి కనిపించని వాటి గురించి తెలుసుకోవడం. వాటి గురించి మీరు ఎంత తెలుసుకుంటే మీరు అంత జ్ఞానులు. అందుకే పత్రిగారు మరణించిన తర్వాత జరిగేది ఎవరికీ తెలియదు కాబట్టి, దాని గురించి తెలుసుకోండి అంటారు. అందుకే ఇప్పుడు నేను దాని మీద ఎక్కువ ఫోకస్ చేస్తున్నాను. చనిపోయిన తర్వాత ఆత్మను ఉన్నత లోకాలు చేర్చగలిగితే భూమ్మీద మీ బాధ్యత మీరు నెరవేర్చుకున్నట్టే, అదే ఆత్మ బాధ్యత.

ధనం ఎంత సంపాదించినా మీరు తృప్తి పడరు. అలాగే ఆత్మైన మీరు జ్ఞాన సంపాదనకి తృప్తి లేకుండా కష్టపడాలి. నేను ఎన్నో రాష్ట్రాలు తిరుగుతున్నాను, జ్ఞానకాంక్ష ఉన్నవాళ్ళు అన్ని చోట్ల ఉన్నారు అస్సలు లేకుండా లేరు.

అందరికీ కాకపోయినా వాళ్ళకి ఈ జ్ఞానాన్ని మనం అందించగలిగితే ఇంక అంతకన్నా కావలసింది ఏమీ లేదు, అందుకే తిరుగుతున్నాను.  పత్రి గారికి నా వయస్సు వచ్చాక ఎప్పుడూ తోడుగా ఇద్దరు ఉండేవారు, ఎవరూ లేకుండా ఆయన వెళ్ళేవారు కాదు.

మొన్న నేను ధారవాడ వెళ్ళినప్పుడు సాయిలీల ఏవండీ మీరు లెక్క లేకుండా తిరుగుతున్నారు. మీరు తూలుతున్నారు, మీకు తెలియట్లేదేమో! మాకు తెలుస్తుంది. మీ కూడా ఎవరినైనా తీసుకుని వెళ్ళమంటే మీరు వద్దు

అంటారు అని సాయిలీల అంది. ఏదైనా అవ్వనీ భూమిమీద ఉన్నంత కాలం 10 మందికీ జ్ఞానం అందివ్వాలి, అదే నా ఆశయం.

పత్రి గారు మరణిస్తాను అని తెలిసినా కూడా లేలడక్ వెళ్లారు. కడ్తాల్లో మన ట్రస్టీలంతా వద్దన్నారు, అయినా సరే ఆయన లెక్కచేయలేదు. ఆయన ఫ్లైట్ రద్దయితే వెనక్కి వచ్చేయొచ్చు, లేకపోతే ఆగిపోవచ్చు. కానీ నాకు హెలికాప్టర్ కావాలి నేను దాంట్లో వెళ్తానన్నారు, ఎంత పట్టుదలో చూడండి. అనుకోకుండా ఏదో ఫ్లైట్లో రెండు టికెట్లు దొరికాయి. వెళ్లాక ఢిల్లీలో సిక్ అయితే ఒక రెండు రోజులో, మూడు రోజులో అక్కడే ఆగి తర్వాత వచ్చారు. వచ్చిన తర్వాత ఎక్కువ రోజులు లేరు.

మరి ఆయన అలాంటి స్టేజ్‌లో కూడా విశ్రాంతి తీసుకోకుండా ఎంత కష్టపడ్డారు. మనం పడుకుంటే ఎలాగా? అందుకే నేనూ చేస్తున్నాను, మిమ్మల్ని అంత కష్టపడమని  అనను. పత్రి గారు చెప్పినట్టుగా 50% దేహానికి, 50% ఆత్మకి కేటాయించుకోండి అని కూడా అనను కానీ, కనీసం 75% దేహానికి చూసుకోండి, 25 % ఆత్మకి కేటాయించుకోండి అని చెప్తున్నాను. నేను చెప్పే మాటలు మీరు పైకెళ్ళాక అర్థమవుతాయి.

అందుచేత పగటి జీవితం అంటే జ్ఞానం పూర్తిగా పొందిన వారి జీవితం. ఆ జ్ఞానం పొందినవాడి ప్రవర్తన ఎలా ఉంటుంది? అలాగే జ్ఞానం పొందకుండా అజ్ఞానంలో ఉంటూ రాత్రి జీవితంలో ఉన్నవాడి ప్రవర్తన ఎలా ఉంటుంది? అన్నది కొద్దిగా తెలుసుకుందాం.

1. సహజంగా జ్ఞాని ప్రాపంచిక విషయాల పట్ల విరక్తి కలిగి ఉంటాడు,; ఆత్మ విషయాల పట్ల ఆసక్తి కలిగి ఉంటాడు.; కానీ అజ్ఞాని ప్రాపంచిక విషయాల పట్ల ఆసక్తి కలిగి ఉంటాడు,; ఆత్మ విషయాల పట్ల విరక్తి ప్రదర్శిస్తూ ఉంటాడు.

జ్ఞాని ఆధ్యాత్మికంలో ఉంటాడు, అటువంటి జ్ఞానిని జ్ఞానంతో ఆకర్షించాలి. కాని అజ్ఞాని ప్రాపంచికంలో ఉంటాడు, అటువంటి ఆజ్ఞానిని

ధనంతో ఆకర్షించాలి.

2.జ్ఞాని దుఃఖంలో కూడా ఆనందంగా జీవిస్తాడు,; కానీ అజ్ఞాని ఆనందంగా ఉండవలసిన సందర్భాల్లో కూడా దుఃఖిస్తాడు.

3.జ్ఞాని కోరికలను అదుపులో ఉంచుకుంటాడు, కానీ అజ్ఞాని కోరికలకు బానిస అవుతాడు.

4. జ్ఞాని ఆశపడడు.

5. జ్ఞాని జ్ఞానాన్ని పెంచుకుంటాడు, ఆ జ్ఞానమే అతనిని రక్షిస్తుంది, కాని అజ్ఞాని ధనాన్ని పెంచుకుంటాడు, ఆ ధనాన్ని అజ్ఞానే రక్షించుకోవాలి.

6. జ్ఞాని ఉన్నదానితో తృప్తిగా జీవిస్తాడు, కానీ అజ్ఞానికి ఎన్ని ఉన్నా తృప్తి ఉండదు.

7.జ్ఞాని ఉన్నదాంట్లో పంచుతాడు,; కానీ అజ్ఞాని ఏది; పంచ లేడు.

8.జ్ఞాని ఇవ్వకుండా ఉండలేడు, అజ్ఞాని ఇవ్వలేడు.

9.ఆత్మజ్ఞానికి అంతా ఒకటే,; కానీ అజ్ఞాని అంతా వేరు వేరు అనుకుంటాడు.

10.జ్ఞాని అందరినీ ప్రేమిస్తాడు, తన వాళ్లతో సహా అందరినీ సమానంగా భావిస్తాడు. కానీ అజ్ఞాని అందరిని ద్వేషిస్తాడు, తనవారిని ప్రత్యేకంగా చూస్తాడు. అంటే రాగద్వేషాలు ప్రదర్శిస్తాడు.

11. జ్ఞాని ఇతరుల కోసం ఆలోచిస్తాడు, కానీ అజ్ఞాని తన కోసమే ఆలోచిస్తాడు.

12.జ్ఞాని ఇతరుల ఆనందం కోసం పాటుపడతాడు, కానీ అజ్ఞాని తన ఆనందమే చూసుకుంటాడు.

13. జ్ఞాని లోకకళ్యాణ కరమైన కార్యక్రమాలు నిర్వహిస్తాడు, వాటిని ప్రోత్సహిస్తాడు,; వాటికి సహకరిస్తాడు.; కానీ అజ్ఞాని ప్రోత్సహించడు, సహకరించడు.

ఏది ఏమైనా గుర్తుపెట్టుకోండి ఎవరైనా పగటి జీవితం జీవించాలి.

# ఏడు శరీరాలు

అజ్ఞాన స్థితిలో ఉన్న మానవులకి తెలిసున్నది ఈ కంటికి కనిపించే శరీరం ఒక్కటే. కానీ మన కంటికి కనిపించకుండా ఇంకా ఆరు శరీరాలు ఉన్నాయి. అవి జ్ఞానం ఉన్నవాడికే తెలుస్తుంది. ఈ విషయం అజ్ఞానంలో ఉన్నవాడికి తెలియదు. మనమంతా జ్ఞానం పెంచుకునే ప్రయత్నం చేస్తున్నాం. అంటే కంటికి కనిపించని వాటి గురించి కూడా తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నాం. తెలుసుకోవాలి కూడా! లేకపోతే మీ జీవితమంతా అయోమయమే, అంధకారమే.

అందుచేత ఉన్నది ఒకటే శరీరం కాదు, అంతర్లీనంగా ఆరు శరీరాలు ఉన్నాయి. అందుచేత మొత్తం ఈ ఏడు శరీరాల గురించి తెలుసుకుందాం.

1) ఫిజికల్ బాడీ అంటే స్థూల శరీరం. దీన్నే శంకరాచార్యుల వారు "అన్నమయ కోశం" అంటారు.

2) ఎథిరిక్ బాడీ అంటే కాంతిమయ శరీరం. దీన్నే ప్రాణమయ కోశం అని కూడా అంటారు.

3) ఆస్ట్రల్ బాడీ లేదా మెంటల్ బాడీ అంటే సూక్ష్మ శరీరం లేదా భావనా మయ శరీరం. దీన్నే మనోమయ కోశం అని కూడా అంటారు. ఇవన్నీ మనం ఎందుకు లోతుగా తెలుసుకోవాలి అంటే ఒక్కొక్క యోగీశ్వరుడు ఒక్కొక్క దాన్ని చెప్తూ ఉంటాడు. అవన్నీ తెలుసుకుంటే గందరగోళ పడం.

అదే తెలియకపోతే ఆయన అలా చెప్పాడు, ఈయన ఇలా చెప్పాడు అని గందరగోళ పడతారు. అందుకే ఇవన్నీ క్షుణ్ణంగా తెలుసుకోవాలి, ఓ రకంగా చెప్పాలంటే బట్టి పట్టాలి. బట్టీ పట్టకపోతే మీకు తర్వాత చెప్పేటటువంటి సబ్జెక్టులు అర్థం కావు.

4) కాజల్ బాడీ అంటే కారణ శరీరం. దీన్నే శంకరాచార్యుల వారు విజ్ఞానమయ కోశం అంటారు.

5) స్పిరిట్యువల్ బాడీ అంటే మహా కారణ శరీరం దీన్నే ఆనందమయ కోశం అని కూడా అంటారు.

6) కాస్మిక్ బాడీ అంటే విశ్వమయ శరీరం దీన్నే విశ్వమయ కోశం అని కూడా అంటారు.

7) నిర్వాణిక్ బాడీ అంటే నిర్వాణమయ శరీరం. దీన్నే నిర్వాణమయ కోశం అని కూడా అంటారు.

ఇలా ఏడు శరీరాలతో ఉన్నాం. ఆత్మ పైన ఈ ఏడు తొడుగులూ ఉన్నాయి! కనిపించే ఈ భౌతిక శరీరం లోపల అంతర్లీనంగా ఈ ఆరూ ఉన్నాయి. ఇవి అవగాహన ఉండాలి. మరి యోగులు ఏదైనా క్లాసులు చెప్పేటప్పుడు, వీటిని ఉదహరించినప్పుడు నీకు అవగాహన ఉంటే ఆ సబ్జెక్ట్ బాగా అర్థమవుతుంది. లేకపోతే అర్థం కాదు, ఏంటి ఇలా చెప్తున్నారు అనుకుంటారు.

అంతే కాదు మానవుడికి చైతన్యం భౌతిక శరీరంలో కేంద్రీకృతమై ఉన్నప్పుడు, అంటే జాగ్రదావస్థలో ఉన్నప్పుడు ఈ స్థూల విశ్వంలో విహరిస్తూ కర్మలు చేస్తూ ఉంటాడు. భౌతిక శరీరంలో ఆ చైతన్యం ఉంటే మానవుడు అంటారు.

అంటే మానవుడు ఈ జాగ్రదావస్థలో రోజూ కర్మలు చేస్తూ ఉంటాడు. ఈ స్థూల విశ్వంలో అని అన్నాం, ఈ విశ్వంలో మనకి రెండు రకాల లోకాలు కనిపిస్తాయి. స్థూల లోకాలు అన్నీ కలిపితే స్థూల విశ్వం అంటారు. సూక్ష్మ లోకాలు అన్నీ కలిపితే సూక్ష్మ విశ్వం అంటారు. ఈ స్థూల లోకాలు కంటికి కనిపిస్తూ ఉంటాయి, సూక్ష్మ లోకాలు కంటికి కనిపించవు.

అలా ఈ స్థూల శరీరంలోకి మీరు ప్రవేశించక ముందే, అంటే ఆత్మ ప్రవేశించక ముందే పైలోకాల్లో ఒక ప్రణాళిక వేసుకుని క్రిందకి వస్తారు. భూమ్మీదకి వచ్చి ఒక తల్లి గర్భంలో తయారయ్యే శరీరంలో ప్రవేశించి జన్మ తీసుకుంటారు. జన్మ తీసుకున్న దగ్గర నుంచి శరీరం వదిలేదాకా రకరకాల

కర్మలు చేస్తూనే ఉంటారు. పాప కర్మలూ చేస్తారు, పుణ్య కర్మలూ చేస్తారు. కాస్త జ్ఞానం పొందినవారు ఆత్మ కర్మలు చేస్తారు, దాన్నే భౌతిక జీవితం అంటారు.

ఈ రకంగా శరీరం లో ఉండి కర్మలు చేస్తూన్న జీవితాన్ని భౌతిక జీవితం అంటారు, ప్రాపంచిక జీవితం అని కూడా అంటారు. అలా పైలోకాల్లో ఎంతవరకు ఆయుష్య నిర్ణయించుకున్నారో అంతవరకు చేస్తూనే ఉంటారు. మీరు నిర్ణయించుకున్న ఆయుష్షు పూర్తయిపోతే మీకు మరణం సంభవిస్తుంది. అప్పుడు ఈ స్థూల శరీరంలోనుంచి సూక్ష్మ శరీరం విడుదల అవుతుంది. ఈ సూక్ష్మ శరీరానికి, స్థూల శరీరానికి మధ్య కాంతిమయ శరీరం అంటే ప్రాణమయ శరీరం ఒకటి ఉంది.

అది భౌతిక శరీరాన్ని తగలేయకపోతే దాన్నే అంటిపెట్టుకుని ఉంటుంది. రెండు మూడు రోజులు ఉండి తర్వాత ఆటోమేటిక్ గా రాలి పోతుంది. అదే ఆ భౌతిక శరీరాన్ని తగలేస్తే అదృశ్యం అయిపోతుంది.

అప్పుడు ఆ సూక్ష్మ శరీరంతో వీరిని సూక్ష్మ లోకాలకు తీసుకు వెళ్ళడానికి వచ్చినటువంటి సహాయకులతో భూమ్మీద తాను చేసిన కర్మలను బట్టి ఆ సూక్ష్మ లోకాలకు చేరుకుంటారు. మనకు పత్రి గారు చెప్పారు పాపాలు చేసిన వాళ్ళు భువర్ లోకం, పుణ్యాలు చేసినవాళ్ళు సువర్లోకం చేరుకున్న తర్వాత కొన్నాళ్ళు విశ్రాంతి తీసుకుని తర్వాత ఆ జన్మలో భూమ్మీద చేసినటువంటి కర్మలను చూసుకుంటారట.

అరే చేయవలసింది చేయకుండా ఏవేవో చేసానే అని పశ్చాత్తాప పడతారు. పశ్చాత్తాప పడి ఈసారైనా మరలా దేహాన్ని తీసుకుని అనుకున్నది సాధిస్తాను అని నిర్ణయించుకొని తనకు ఉన్నటువంటి సూక్ష్మ శరీరాన్ని అంటే మనోమయ శరీరాన్ని సూక్ష్మ లోకాల్లో వదిలేస్తారు. అది ఉంటే ఆ లోకాలు దాటి పైలోకాలకి అంటే జనాలోకం చేరలేరు.

అలా సూక్ష్మ శరీరాన్ని వదిలేసి కారణ లోకాలకి అంటే జనా లోకానికి

చేరుకుంటారు. అక్కడికి చేరుకున్నాక తన స్వంత బింబాన్ని అంటే సూత్రాత్మను అంటే కారణ దేహాన్ని చేరుకుంటారు. నిజానికి ఆ బింబం ఎప్పటికీ కారణ లోకాన్ని విడువదు. భూలోకానికి వచ్చినా, సమాంతర లోకాలకు చేరుకున్నా ప్రతిబింబం తిరిగి తన స్వంత బింబాన్ని చేరుకుంటుంది.

అందులో నుంచి ఉద్భవించిన ఒక ప్రతిబింబమే భూలోకానికి వచ్చి, కర్మలు చేసి, శరీరం వదిలి సూక్ష్మ లోకాల్లో కర్మఫలాలను అనుభవించి, తిరిగి తన మూల బింబంలో తాను లీనం అవుతుంది. ఈ పర్యటన మొత్తం యొక్క ఫలం జ్ఞానమే.

పత్రి గారు చెప్పినటువంటి ఈ సందేశాన్ని అర్థం చేసుకోవడానికి నాకే చాలా సమయం పట్టింది. పత్రి గారికి అపారమైన జ్ఞానం ఉంది, కానీ మనకి చెప్పినా అర్థం చేసుకోలేమని మనం అర్థం చేసుకోగలిగినంత వరకు మాత్రమే ఆయన చెపుతున్నారని నాకు అర్థమయింది. ఆయన ఇంకా లోతులలోకి చెబితే మనకి గందరగోళమే.

ఇదంతా పత్రి గారు చెప్పినటువంటి జ్ఞానమే. ఈ విషయాలు ఎవరికి తెలుస్తాయండి! పూర్ణాత్మ నుంచి విడువడినటువంటి ఆత్మను అంశాత్మ అంటారని మనం చెప్పుకున్నాం. ఈ అంశాత్మ మానవ శరీరంలో ప్రవేశిస్తే జీవాత్మ అవుతుంది అని చెప్పుకున్నాం.

ఈ అంశాత్మ మానవ శరీరంలో ప్రవేశించే ముందు కారణ లోకానికి చేరుకుంటుందట. ఆ కారణ లోకాల్లో వున్నదాన్నే బింబము అంటారు. దాంట్లోంచి ఉద్భవించిన ప్రతిబింబమే భూమ్మీద తల్లి గర్భంలో తయారయ్యే శరీరంలో ప్రవేశిసించి జన్మ తీసుకుంటుంది. కర్మలు చేస్తుంది, అలా జన్మలు పెరిగాక జ్ఞానాన్ని కూడా పెంచుకుంటుంది.

అలా ఆ బింబం కారణ లోకాల్లో ఉన్నంత కాలము జన్మలు తీసుకుంటూనే ఉంటుందట. ఎప్పుడైతే జ్ఞానం పెరుగుతూ ఉంటుందో అప్పుడు ఆ స్థితి దాటిపోతూ ఉంటుంది. ఇదంతా బాగా అర్థం కావాలంటే మరణించక

ముందే మరిణించాలి అనే పుస్తకం బాగా చదవాలి.

ఇలా తెలుసుకోవాల్సింది ఇంకా ఎంతో ఉంది. అవన్నీ తెలుసు కోవాలంటే ఇంకా ఎన్నో జన్మలు పడుతుంది, కనుక ఆ జ్ఞానాన్ని బోధించగలిగిన వారిని ఆశ్రయించాలి, వారిని పట్టుకోవాలి. ఆ జ్ఞానాన్ని అర్థం చేసుకోవాలి అంటే ముందు మీ బుద్ధి బాగా పెంచుకోవాలి. అప్పుడు వారు చెప్పింది అర్థమవుతుంది, లేకపోతే ఎంత చెప్పినా అర్థం కాదు.

నేను అందుకే అంటాను పత్రి గారి లాంటి గురువు దొరకడం చాలా కష్టం. అటువంటి గురువు దొరికినా ఆయన బోధించిన జ్ఞానం అర్థం చేసుకోలేకపోతే వాడికంటే దురదృష్టవంతుడు ఎవడూ లేడు. అపారమైన జ్ఞానం బోధించాడాయన, ఆ జ్ఞానం పొందడానికి "శ్వాస మీద ధ్యాస" ధ్యానం చేయమని చెప్పాడు.

అది మానేసి మ్యూజిక్‌లు పెట్టుకుని, గైడింగ్లు, పెద్ద పెద్ద సౌండ్లు, రికార్డులు పెట్టుకుంటే వీళ్ళకి జ్ఞానం ఏమి వస్తుంది? ఏం తెలుస్తాయి. అందుచేత ఇప్పటికైనా జ్ఞానం మీద దృష్టి పెట్టండి.

ఈ విధంగా ప్రతి జన్మలో ఆత్మ కొంత జ్ఞానాన్ని సంతరించుకుంటే అంటే సంపాదించుకుంటే, క్రమంగా ఒక్కొక్క లోకాన్ని దాటుతూ పూర్ణ ఆత్మజ్ఞానం కలగడంతో కారణ లోకాలను వదిలి అంటే అప్పటిదాకా ఉన్న ఆ జనాలోకం వదిలి మహా కారణ లోకాల్లోకి ప్రవేశిస్తుంది. ఈ బింబాత్మ కారణ లోకాల్లో ఉన్నంతవరకు జన్మ తప్పదు. ఆ తర్వాత కావాలనుకుంటే వస్తుంది లేకపోతే లేదు.

అందుచేత తనను తాను సంపూర్ణంగా తెలుసుకోవడమే జన్మ రాహిత్య పదవిని పొందడం, అంటే మోక్షాన్ని పొందడం. అంటే అలా పొందడం వల్ల ఈ అంశాత్మ ఏ పూర్ణాత్మ నుంచి అయితే విడువడిందో ఆ పూర్ణాత్మతో సారూప్యాన్ని, సామీప్యాన్ని, సాలోక్యాన్ని చివరిగా సాయుధ్యాన్ని చిరకాలంలో పొందుతుంది. అంటే అంశాత్మ యొక్క ప్రయాణం పూర్తి అవుతుంది. ఒక

రకంగా చెప్పాలంటే ఇది మొదటి ప్రయాణం అనుకోవచ్చు, తర్వాత ఇంకా ఉంటాయి.

ఇప్పుడు అలా పొందిన మోక్షాన్ని అంటే ముక్తిని నాలుగు రకాలుగా వివరించడం జరిగింది. వాటిని కొంచెం వివరించుకుందాం. ఇక్కడ మనం నాలుగు రకాల ముక్తులు ఉన్నాయి అని చెప్పుకున్నాం.

1) సారూప్య ముక్తి, 2) సామీప్య ముక్తి, 3) సాలోక్య ముక్తి,
4) సాయుజ్య ముక్తి

1) సారూప్య ముక్తి అంటే సకల పాపాల నుండి విడువడినవాడు భగవంతుని సారూప్యాన్ని అంటే ఆయన స్వరూపాన్ని పొందుతాడని అర్థం. వీడు భగవంతుడు అవుతాడు, దీనినే సారూప్య ముక్తి అంటారు.

2) సామీప్య ముక్తి అంటే బ్రహ్మజ్ఞానం మీద అపేక్ష గల మానవుడు అన్య చింతలు లేనివాడై అంటే మిగతా ప్రాపంచిక వ్యవహారాల గురించి ఆలోచించకుండా సదాచారవంతుడై మెల్లిగా ఆ భగవంతుని సామీప్యాన్ని అంటే ఆ భగవంతుడ్ని చేరతాడు అని అర్థం. అంటే ఆ పూర్ణాత్మ ఉండే సత్యలోకానికి చేరుకుంటాడు అని అర్థం. ఆ భగవంతుని పొందడానికి చేయవలసినవన్నీ చేస్తున్న వాడినే సదాచారవంతుడు అంటారు.

ఎనకి భగవద్గీతలో 8వ అధ్యాయం 16వ శ్లోకంలో ఏం చెప్పారంటే

**శ్లో ॥ ఆ బ్రహ్మ భువనాల్లోకాః పునరావర్తినోర్జున ।**
**మాముపేత్యంతు కౌంతేయ పునర్జన్మ న విద్యతే ॥ (భ.గీ.8-16)**

తా :- నువ్వు ఆ బ్రహ్మ లోకాల్లాంటి లోకాలకి అంటే తపోలోకానికి వెళ్ళినా కూడా మళ్ళీ భూమి మీదకి వస్తావు. కానీ నేను ఉండేటటువంటి సత్య లోకానికి చేరుకుంటే మరల నీకు మానవ లోకానికి రావలసిన అవసరం లేదు. దాన్నే ముక్తి, మోక్షం అంటారు, దీన్నే సామీప్య ముక్తి అంటారు.

3) సాలోక్య ముక్తి అంటే బ్రహ్మ జ్ఞానం పొందడం వల్ల భగవంతుడ్ని చేరగలుగుతాడు. దీనివల్ల కూడా భగవంతుడు ఉండే సత్యలోకం

చేరగలుగుతాడు. దీనిని సాలోక్య ముక్తి అంటారు. చివరికి జరిగేది అదే, ఏదైనా జ్ఞానం సంపాదించుకుంటూ పూర్ణ జ్ఞానం పొంది, ఆ పూర్ణాత్మ అంటే ఆ భగవంతుడు ఉండే ఆ సత్యలోకం చేరడమే.

4) సాయుజ్య ముక్తి అంటే గురువు ఉపదేశించిన ధ్యాన మార్గంలో ఆత్మతో అనుసంధానమై భ్రమర కీటక న్యాయంలా అంటే ఎప్పుడూ ఒక రమణ మహర్షి లాగ, ఒక రామకృష్ణ పరమహంస లాగ నెలలూ, సంవత్సరాలూ ఉండిపోతారు.

షిరిడి బాబా చెప్పారు కదా 13 సంవత్సరాలు నేను నా గురువుతో ఉన్నానని, పత్రిగారు కూడా నేను ఒక జన్మలో పూర్తిగా ధ్యానంలో ఉన్నానని చెప్పారు.

అంటే కీటకాన్ని గూట్లో పెట్టి భ్రమరం ఝుంకార నాదం చేయడం వల్ల ఆ కీటకం కూడా భ్రమరంగా మారిపోతుంది. అలాగే ఆత్మతో నెలల పాటు, సంవత్సరాల పాటు అలా ఉండిపోవడం వల్ల ఆ ఆత్మ శక్తులన్నీ వీరికి లభించి వీరు ఆ భగవంతుడు అయిపోతారు. కీటకం భ్రమరం అయినట్టు ఈ మానవుడు కూడా మాధవుడు అయిపోతాడు.

ఒక ఇనుప ముక్కకి అయస్కాంతాన్ని తగిలించి ఉంచితే కొన్ని రోజులకి ఈ ఇనుప ముక్క కూడా అయస్కాంత శక్తి సంతరించుకొని అది కూడా ఇనుప ముక్కల్ని ఆకర్షిస్తుంది. అలా వీడు కూడా భగవంతుని స్థితి పొందుతాడు. అంటే భగవంతుని సాయుజ్యం పొందుతాడు, దీనినే సాయుజ్య ముక్తి అంటారు.

ఇలా ఈ ముక్తుల్లో ఏది సాధించినా తాను పరమాత్మగా, తారగా, చిరకాలం అచలంగా, స్వయంభువుగా, ఆదిత్యుడిగా, సర్వలోక జ్ఞాన ప్రదాయిగా, శక్తి ప్రదాయిగా నిలిచిపోతాడు. ఇప్పుడు ఈ ప్రయాణంలో సాధకుడు తాను చేసే సాధన బట్టి ఒక్కొక్క సారి ఒక్కొక్క లోకానికి వెళ్తూ ఉంటాడు.

ఆ స్థితి సంపాదించిన వాళ్ళు ఆయా లోక పరిధిని బట్టి ఆయా శరీరాలను ఆటోమేటిక్ గా మార్చుకొని వెళ్తూ ఉంటారు.

ఉదాహరణ:- మనకి షార్ రాకెట్ కేంద్రంలో రాకెట్లు వెళ్తూ ఉంటాయి. ఆ రాకెట్ ప్రయాణం చేస్తూ చేస్తూ అది కక్ష్య అంటే రూటు మార్చుకోవాల్సి వస్తుంది,

అలాగే వెళ్ళదు. ఆ ప్రక్కకో, ఈ ప్రక్కకో తిరగవలసి వస్తుంది. అప్పుడు అంతవరకు ఇంధనంగా ఉపయోగించబడ్డ దాన్ని అక్కడ వదిలి పెట్టేస్తూ ఉంటుంది. అలాగే లోకాన్ని బట్టి ఆత్మ శరీరం కూడా మార్చుకుంటూ ఉంటుంది.

ఎందుకంటే పై లోకాలకు అంటే ఊర్ధ్వ లోకాలకి చేరే కొద్దీ ఆ లోకాలు చాలా సూక్ష్మంగా ఉంటాయి. ఎంత సూక్ష్మంగా ఉంటే అంత పైలోకాలకి వెళ్తారు.

అందుకే మీరు గమనించండి మొత్తం ఏడు శరీరాలు చెప్పుకున్నాం. బాగా స్థూలమైనది భౌతిక శరీరం, తర్వాత ప్రాణమయ శరీరం, తర్వాత మనోమయ శరీరం, ఇంకా సూక్ష్మమైనది కారణ శరీరం, దానికంటే సూక్ష్మమైనది మహా కారణ శరీరం, దానికంటే సూక్ష్మమైనది విశ్వమయ శరీరం, దానికంటే సూక్ష్మాతి సూక్ష్మమైనది నిర్వాణమయ శరీరం. అప్పుడు ఆ లోకానికి చేరి దాన్ని వదిలేస్తే ఉండేది ఆత్మ ఒక్కటే, అది మళ్లీ పూర్ణాత్మ అయిపోతుంది.

ఊరికే రోజూ ప్రొద్దున్నే గంట, సాయంత్రం ఒక గంట ధ్యానంలో కూర్చుని మీకు ఆ స్థితి రావాలంటే రాదు. ఇప్పుడు జనం ఏవో భౌతికమైన ఇబ్బందులు ఉన్నాయని, రోగాలు, ఏవో మానసికమైన సమస్యలు, కుటుంబ సమస్యలు, పిల్లలతో, తల్లిదండ్రులతో, భర్తతో, ఈ గొడవలు ఉన్నాయని వాటిని ఈ ధ్యానం ద్వారా తొలగించుకోవడానికే ప్రయత్నిస్తున్నారు, ఈ ధ్యానం దానికోసమే అనుకుంటున్నారు.

కానీ అవన్నీ అల్పమైనవి. ఈ ధ్యానం ద్వారా అసలైనవి ఏమిటి అంటే ఈ రకమైన ముక్తుల్లో ఏదో ఒక ముక్తిని పొందాలి, ఆ సత్యలోకం

చేరాలి, ఆ పూర్ణాత్మ కావాలి, అది ఎవరైనా సరే చేయవలసిందే, సాధించవలసిందే. ఈ ప్రయత్నం చేసినప్పుడు మిగిలినవి ఆటోమేటిక్ గా పరిష్కారం అయిపోతాయి.

మీరు ఈ ప్రయత్నం చేయండి. ఎంత అవకాశం ఉంటే అంత సమయాన్ని ఉపయోగించి ఈ జ్ఞానాన్ని పెంచుకునే ప్రయత్నం చెయ్యండి. మీరు అలా చేస్తూ ఉంటే మీకు కనీసం మరుజన్మైనా అనుకూలమైన జన్మ వస్తుంది. అర్జునుడు కృష్ణుడిని అడుగుతాడు ఈ జన్మలో చేయలేకపోతే, సాధించలేకపోతే ఏం చేయాలి? అని.

నాయనా! ఈ జన్మలో నీవు ప్రయత్నం చేస్తే మరుజన్మలో శ్రీమంతుల గృహంలో పుడతావు, లేకపోతే యోగుల గృహంలో పుట్టి తర్వాత చేయవలసిన సాధన పూర్తి చేసి మోక్షాన్నే పొందుతావు అన్నాడు. కనుక ఎవరైతే దీక్షగా చేస్తారో వారు ఈ జన్మనే చివరి జన్మ చేసుకుంటారు లేకపోతే తర్వాత రాబోయే జన్మైనా చివరి జన్మ అవుతుంది.


## తటవర్తి దంపతుల Website ద్వారా పొందే సమాచారము

website address : www.tst.org.in

a) తటవర్తి దంపతుల ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల వివరములు మరియు Google Maps Location తెలుసుకోవచ్చు.
b) తటవర్తి దంపతుల మొత్తం పుస్తకాలు PDF రూపంలో కలవు. వాటిని ఉచితంగా Download చేసుకోవచ్చు. ఈ పుస్తకాలు తెలుగు, కన్నడ, హిందీ మరియు ఇంగ్లీషు భాషలలో వున్నాయి.
c) తటవర్తి దంపతుల సందేశాలు Concept వారీగా YouTube Play lists రూపంలో ఇవ్వడం జరిగింది.
d) తటవర్తి దంపతుల సందేశాల సారాంశము కొటేషన్స్ రూపంలో ఇవ్వడం జరిగింది.
e) తటవర్తి దంపతుల ఫోటోలు కూడా చూడవచ్చు.
5. భీమవరంలో ప్రతి నెలా 1, 2, 3 తేదీలలో జరిగే ఉచిత ఆత్మజ్ఞాన శిక్షణా తరగతుల రిజిస్ట్రేషన్ కొరకు సంప్రదించవలసిన నెంబరు : **సింధూర, 8555995217**

# "తప్పు పట్టడం అన్నిటికన్నా పెద్ద తప్పు".

పత్రిగారు ఏమన్నారంటే **"తప్పు పట్టడం అన్నిటికన్నా పెద్ద తప్పు"** అన్నారు. ఇక్కడ చూస్తే ఒక చిన్న వాక్యం కింద ఉంటుంది. దీంట్లో అంతు లేని అర్థం ఇమిడి ఉంది. ఇది అర్థం చేసుకుని ఆచరించిన వాడు గొప్పవాడు అవుతాడు. అర్థం చేసుకోకుండా ఆచరించకపోతే ఎంతో నష్టపోతాడు.

అందుకే పత్రిగారు ఎవరినీ విమర్శించద్దు అంటారు. విమర్శ అంటే ఎదుటివారి లోపాన్ని ఎత్తి చూపడం. ఆయన **"నో కామెంట్, నో జడ్జ్మెంట్"** అన్నారు. ఎవరినీ విమర్శించవద్దు, ఎవరి గురించి నిర్ణయాలు చేయవద్దు అని. ఇప్పుడు ఈ సందేశానికి, దానికి  కాస్త దగ్గర సంబంధం ఉంది, అందుచేత తెలుసుకుందాం.

ప్రపంచంలో రకరకాల మనుషులు ఉన్నారు. పూర్ణాత్మ నుంచి విడుదలైనటువంటి అంశాత్మలమైన మనం మొట్టమొదటిగా మానవ శరీరంలో ప్రవేశిస్తాం. అలా మానవ శరీరంలో ప్రవేశించి 100 జన్మలు తీసుకున్నవాళ్ళు ఉన్నారు, 200 జన్మలు తీసుకున్నవాళ్ళు ఉన్నారు, 300 జన్మలు కూడా తీసుకున్న వాళ్ళు కూడా ఉన్నారు. కానీ వీరందరి స్వభావాలు ఒకే రకంగా ఉండవు.

మొట్టమొదటి జన్మల్లో అంటే ప్రారంభ జన్మల్లో తమోగుణ ప్రధానిగా వస్తాడు. అలా కొన్ని జన్మలు తీసుకున్న తర్వాత మెల్లి మెల్లిగా ఆ గుణం మారిపోతూ రజోగుణ ప్రధానిగా తయారవుతాడు. ఆ తర్వాత  ఇంకా మారుతూ సత్వగుణ ప్రధానిగా అయిపోతాడు. ఆ తర్వాత  నిర్గుణి అయిపోతాడు.

అంటే మానవులు రకరకాల గుణాలతో  చూడడానికి అంతా మానవుల్లాగే ఉంటారు. అందరికీ ఒకే రకమైన అవయవాలు ఉంటాయి. కానీ వాళ్ళు చేసే పనులు, ఆలోచనలు అన్నీ ఒకే రకంగా ఉండవు.

ఒకడు సేవలు చేస్తాడు, ఇంకొకడు హత్యలు చేస్తాడు, ఒకడు బాగా

సంపాదించుకుంటాడు, ఇంకొకడు ఉన్నవి పోగొట్టుకుంటాడు. ఒకడు భార్యని ప్రేమగా చూసుకుంటాడు, ఇంకొకడు పెళ్లానికి నరకం చూపిస్తాడు. కొందరు జీవులని హింసిస్తారు, ఇంకొందరు ఆ జీవుల్నే ప్రేమిస్తారు. ఒకడు సేవలు చేస్తాడు, ఇంకొకడు మోసాలు చేసి ఇతరులని దోచుకుంటాడు.

ఇలా రకరకాల గుణాలతో కూడి ఉన్న మానవులు చేసే బాహ్య కార్యకలాపాలు కూడా ఒకే రకంగా ఉండవు. ఆ గుణాలకు తగిన విధంగానే రకరకాలుగా ఉంటాయి. ఒకరు చేసే పనులు మరొకరితో ఏకం కాజాలవు.

చాలామంది స్త్రీలు ఈ ధ్యాన మార్గంలోకి వచ్చి మాంసం మానేయడం, రోజూ కూర్చుని ధ్యానం చేయడం చేస్తూ ఉంటారు. కానీ వారి భర్తలకి ఇది నచ్చదు, వాళ్ళని తిడుతూ, నిరుత్సాహ పరుస్తూ ఉంటారు. అసలు నువ్వు దేనికి వచ్చావు? సన్యాసులలో కలిసిపోవడానికి వచ్చావా? అని రకరకాలుగా తిడుతూ ఉంటారు. పాపం వీళ్ళు బాధపడుతూ ఉంటారు, ఆయన కూడా మారిపోతే బాగుండును అనుకుంటారు. కాని వీళ్ళు చేసినట్టుగా వాళ్ళ పనులు ఉండవు.

మరి దీనికి కారణం ఒక్కొక్కళ్ళు ఒక్కొక్క గుణం కలిగి ఉందడమే. అందుకే ఒకరి పనులకీ ఇంకొకళ్ళ పనులకీ సంబంధం ఉండదు. ప్రారంభ జన్మలలో ఉన్నవాడు తమోగుణ ప్రధానిగా ఉంటాడు. అటువంటి వాడి ప్రవర్తనా, కార్యకలాపాలు ఆ గుణానికి సంబంధించినవిగా ఉంటాయి. ఆ గుణానికే అంకితమై, ఆ గుణానికే ప్రతిరూపమై, ఆ గుణానికే ఛాయయై ఉంటాయి. అలాగే మధ్యస్థ జన్మలలోకి వస్తే రజో గుణంలో ఉంటాడు. అలా రజోగుణ ప్రధాని అయిన వాడి కార్యకలాపాలు వేరే విధంగా ఉంటాయి.

చాలామంది నా భర్త మారాలి, నా భార్య మారాలి, నా పిల్లలు మారాలి, నా మార్గంలోకి తెచ్చుకోవాలి అనుకుంటారు. కానీ గుణాలు ఒకే రకంగా లేకపోతే అది అసంభవం, అసాధ్యం.

అదే పత్రిగారు చెప్తున్నారు. అందరి పనులు ఒకే రకంగా ఎలా

ఉంటాయి? అంటారు. నువ్వు ఏ వంట చేసుకుని తింటే చెయ్యి ఆ వాసనే వస్తుంది. టమాటా వంట చేసుకుని తింటే చెయ్యి టమాటా వాసనే వస్తుంది. టమాటా వంట చేసుకొని తింటే కాకరకాయ వాసన రాదు. అలాగే వారి గుణాలను బట్టే వారి పనులు ఉంటాయి. అందుకే అందరి పనులు ఒకే రకంగా ఉండడం అసంభవం అన్నారు.

అలాగే ఒక రజోగుణ ప్రధాని అయిన వాడి కార్యకలాపాలు, ఒక సత్వగుణ ప్రధాని యొక్క కార్యకలాపాలు ఒకే లాగఉండజాలవు. రజోగుణ ప్రధాని రాజకీయాల్లో ఉంటాడు. అదే సత్వగుణ ప్రధాని అయితే చక్కటి సంగీతం వింటాడు, చక్కగా భజనలు చేస్తాడు, లేకపోతే చక్కగా ఆటపాటల్లో ఉంటాడు. వాడికి అదే కావాలి.

అలాగే ఒక సాత్విక గుణ ప్రధాని యొక్క కార్యకలాపాలు, ఒక నిర్గుణి యొక్క కార్యకలాపాలు ఒకలాగ ఉండవు. నిర్గుణ ప్రధాని అయినవాడు ఎప్పుడూ ధ్యానం చేస్తూ ఉంటాడు. ధ్యానం గురించే మాట్లాడుతూ ఉంటాడు. ఆ రకంగా మీ ప్రవర్తన ఉంటే మీరు సత్వగుణంలో నుంచి నిర్గుణంలోకి వస్తున్నారని లెక్క.

అందుకే నేను మీరందరూ 350 జన్మలు దాటి, చివరి చివరి జన్మలలోకి వచ్చినవారు అని చెప్తూ ఉంటాను. కనుక మానవుడి బాహ్య కార్యకలాపాలు, క్షేత్రాలు, కురుక్షేత్రాలు వారి వారి అంతర్గుణాల బంధీలు. వారు నిస్సహాయులు, వారిని విమర్శించినా, తప్పు పట్టినా, వాళ్ళేమీ చేయలేరు. వారు ఆ గుణాలకు బంధీలు. అందుచేత వారి బాహ్య కార్యాలు కూడా పోత పోసినట్లుగా అలాగే ఉంటాయి. అందుచేత మీ కార్యకలాపాలు మీ స్వధర్మం యొక్క మూస పోసిన పరిఛాయలు.

అందుచేత మీ గుణం ఒక రకం గాను, మీరు చేసే పనులు ఒక రకంగానూ ఉండడం అసాధ్యం, అసంభవం. అంతేకాదు ఈ గుణం అనేది అంత త్వరగా మారదు. మెల్లి, మెల్లిగా మారుతూ ఉంటుంది, అంటే జన్మలే

పడుతుంది. కానీ అలా గుణం మారాలి అంటే అన్ని జన్మలు తీసుకునే బదులు "శ్వాస మీద ధ్యాస" ధ్యానం చేస్తే ఈ జన్మలోనే మారిపోతాయి.

అందుచేత ఎవరి కార్యకలాపాలనూ కూడా నిందించకూడదు, వాళ్ళు అలాగే ప్రవర్తిస్తారు. ఎందుకంటే? నడవడం నేర్చుకుంటున్నటువంటి పాప ఎలా నడుస్తుందో అలాగే ప్రారంభ జన్మలో ఉన్న ఆత్మ అలాగే ప్రవర్తిస్తూ ఉంటుంది. వాడు కొన్ని జన్మలే ఎత్తాడు, నువ్వు అనుకున్నట్టు ఎలా ప్రవర్తిస్తాడు!

అందుచేత ఐదు జన్మలకు ఏ ఏ స్వభావాలు ఉంటాయో అవే ఉంటాయి. 50 జన్మలకు ఏ ఏ గుణాలు ఉంటాయో అవే ఉంటాయి. అలాగే 300 జన్మలు తీసుకున్నవాడు ఏ పనులు చేయాలో ఆ పనులే చేస్తాడు. అంటే ప్రకృతిలో ఉన్నటువంటి గుణాలను అనుసరించి వాడు ప్రవర్తిస్తూ ఉంటాడు. అందుచేత తప్పనేది ఎక్కడుంది? తప్పనేది లేనే లేదు. అందుకే "తప్పు పట్టడం అన్నది అన్నిటికంటే పెద్ద తప్పు".

కనుక ప్రతీ మానవుడు కొన్ని జన్మల్లో తమో గుణిగా ప్రవర్తిస్తాడు. మరికొన్ని జన్మలు రజోగుణిగా ఉంటాడు! మరి కొన్ని జన్మలు సత్వగుణిగా ఉండి చివరకు ఏ మానవుడైనా సరే నిర్గుణి అయి తీరుతాడు. కనుక ఎవరినీ తప్పు పట్టవలసిన పని లేదు అని పత్రిగారు అద్భుతంగా చెప్పడం జరిగింది.

పత్రిగారు ఇంకా ఏమన్నారంటే "జడ్జ్ ఏ నాట్" అని జీసస్ క్రైస్ట్ అన్నాడని చెప్పారు. ఒక వ్యభిచారిని రాళ్ళతో కొట్టబోతూ ఉంటే ఆయన ఏమన్నాడంటే? మీలో తప్పు చేయని వాళ్ళు ఎవరైనా ఉంటే వాళ్ళు మాత్రమే రాళ్ళతో కొట్టండి అన్నాడు. అప్పుడు అందరూ రాళ్ళు క్రింద పడేశారు.

అందుచేత ఎవరి స్థాయిలో వాళ్ళు తప్పులు చేస్తూ ఉంటారు, ఒప్పులు చేస్తూ ఉంటారు. అందుచేత ఎవ్వరినీ తప్పు పట్టే సమర్థత లేని వాళ్ళం మనం, అందుచేత ఎవరినీ విమర్శించకూడదు. విమర్శించడం పెద్ద తప్పు, నీకంటే ఎక్కువ గుణ స్థితిలో ఉన్నవాళ్ళు చేసే పనులు నీకు తప్పుగానే కనిపిస్తాయి. అలాగే నీ కంటే తక్కువ గుణ స్థితిలో ఉన్నవాళ్ళు చేసే పనులు కూడా నీకు

తప్పుగా కనిపిస్తాయి. అందుచేత ఎవ్వరి చేష్టలనూ కూడా నిందించకూడదు.

వాడు "తప్పు చేస్తున్నాడు అంటే అంతకన్నా పెద్ద తప్పు నువ్వు చేస్తున్నావు" ఇది సృష్టిలో ఉన్న నియమం. సృష్టి నియమాలకి విరుద్ధంగా నువ్వు ఆ పని చేస్తే నువ్వు ఇంకా పెద్ద పాపం చేసినట్టు. వాడు పాపం చేస్తున్నాడు అని నువ్వు అంటున్నావు అంటే నువ్వు ఇంకా పెద్ద పాపం చేస్తున్నావు. మన సొసైటీలో కొంతమంది ఉన్నారు, వాళ్ళు ఎంతసేపు ఫేస్బుక్ లో, వాట్సాప్ లో అలా వీడియోలు పెడుతూ విమర్శిస్తూ ఉంటారు. పత్రి గారు చెప్పినట్టు చేయట్లేదు అంటూ విమర్శిస్తారు. ఇప్పుడు పత్రి గారు "నో కామెంట్, నో జడ్జిమెంట్ అని చెప్పలేదా? మరి వాడు తప్పు చేయట్లేదా? ఇంకా పెద్ద తప్పు చేస్తున్నట్టే.

అందుచేత ఈ విమర్శించే వాళ్ళు, ఎదుటి వాళ్ళని తప్పు పట్టేవాళ్ళు వాళ్ళే నష్టపోతారు అన్న సంగతి తెలుసుకోవాలి.


**తటవర్తి దంపతుల Zoom కార్యక్రమాలు చూడాలంటే?**

a) ప్రతిరోజూ ఉదయం Zoom లో 4 to 6.30 a.m. Silence Meditation మరియు 6.30 to 7.30 a.m. వరకు **ఆత్మజ్ఞాన సందేశాలు**

Zoom I.D. :2413823868, Password : RAO

b) పై కార్యక్రమము 6.30 to 7.30 a.m. వరకు Youtubeలో కూడా Live ఇవ్వబడుతుంది.

c) ఎవరైతే TVR & TRL Whatsapp గ్రూపులో వుంటారో వారికి Zoom Link & You Tube Links మరియు తటవర్తి దంపతుల క్లాసుల వివరాలు పంపడం జరుగుతుంది. వారు **సింధూర: 8555995217** నెంబరు తప్పనిసరిగా save చేసుకోవాలి.

d) తటవర్తి వారి వాట్సాప్ గ్రూపులో జాయిన్ కావాలనుకునేవారు వీరిని సంప్రదించండి. సింధూర: 85559 95217, మధు: 78939 17364 లేకపోతే www.tst.org.in Open చేసిన తర్వాత Join in Whatsapp group లింక్ మీద నొక్కండి.

# చంద్ర వంశీకులు - సూర్యవంశీకులు

జ్ఞానం అన్నది రెండు విధాలు.

1) పరోక్ష జ్ఞానం, 2) అపరోక్ష జ్ఞానం

ఇక్కడ పరోక్ష జ్ఞానం అంటే ఇతరుల నుంచి పొందే జ్ఞానం. ఇతరులు చెప్పిన అనుభవాల ద్వారా మీరు పొందే జ్ఞానం. పరుల జ్ఞాన ప్రకాశం ద్వారా మీరు పొందే జ్ఞానం పరోక్ష జ్ఞానం.

అపరోక్ష జ్ఞానం అంటే స్వీయ అనుభవాల ద్వారా పొందే జ్ఞానం. స్వీయ ప్రకాశం ద్వారా పొందే జ్ఞానం. ఈ స్వీయ ప్రకాశం ద్వారా, స్వీయ అనుభవాల ద్వారా జ్ఞానం ఎలా వస్తుంది అంటే? మీరు విశేషమైన ధ్యాన సాధన చేస్తే, భీమవరం క్లాసులలో రెగ్యులర్గా పాల్గొంటూ, అక్కడ జరిగే గంటల గంటల ధ్యానంలో పాల్గొని ఆలోచన లేని స్థితిలో ఉంటే మెల్లి మెల్లిగా మీకు మీ శరీరంలో ఉన్నటువంటి ఆత్మ నుంచి అంతులేని జ్ఞానం అందుతూ ఉంటుంది.

అప్పుడు ఇతరులు చెప్పింది మీరు చెప్పాల్సిన పనేమీ లేదు. అక్కడ మీరు ఊరికే ఒక విషయం తీసుకుంటారు కానీ అక్కడి నుంచి మీకు అంతర్లీనంగా అందుతూ ఉంటుంది. దాన్నే మీరు చెపుతూ ఉంటారు, ఇదే అపరోక్ష జ్ఞానం. ఈ రకంగా మీరు అందుకుంటున్నది బోధిస్తూ ఉంటే మీరు అపరోక్ష జ్ఞానం బోధిస్తున్నట్లు లెక్క. ఎప్పుడైతే మీరు మీ ఆత్మ ద్వారా అందుతున్న దాన్ని బోధిస్తారో చాలా పర్ఫెక్ట్ గా ఇతరులకి కన్ఫ్యూజన్ లేకుండా చెప్పగలుగుతారు.

ఈ అపరోక్ష జ్ఞానం మీకు అందకపోతే ఇతరులది మీరు చెప్తూ ఉంటారు. మీ సొంతంగా చెప్పాలనుకున్నా  అపరోక్ష జ్ఞానం అందకపోతే ఏదో ఒకటి చెప్తారు.

మీరు రెండు పాయింట్లు తీసుకొని రెండు గంటలు పర్ఫెక్ట్ గా

బోధించగలిగితే మీకు అపరోక్ష జ్ఞానం అందుతున్నట్లు లెక్క, మీరు చాలా గొప్ప బోధకులు అవుతారు. చెప్పడం ముఖ్యం కాదు, బట్టీ పట్టి చెప్పేదానికి, స్వీయ అనుభవాల ద్వారా చెప్పేదానికి చాలా తేడా ఉంటుంది. ఈ స్వీయ ప్రకాశం ద్వారా పొందే జ్ఞానాన్ని, స్వీయ అంటే ఆత్మ ప్రకాశం ద్వారా పొందే జ్ఞానాన్నే అపరోక్ష జ్ఞానం అంటారు.

ఆధ్యాత్మికంగా ఎదగాలనుకునేవారు ఎవరైనా ముందు పరోక్ష జ్ఞానం మీదే ఆధారపడతారు, అది సహజం. కానీ వారి యొక్క తీవ్ర ధ్యాన సాధన వల్ల, పట్టుదల వల్ల, కృషి వల్ల ఈ అపరోక్ష జ్ఞానం కూడా పొందగలుగుతారు.

ఎలా పొందుతారు అంటే? ఎవరైతే “శ్వాస మీద ధ్యాస” ధ్యానం తీవ్రంగా చేస్తారో వారికి మనసు యొక్క ప్రాముఖ్యం తగ్గిపోతూ ఉంటుంది, మనసు యొక్క ప్రాముఖ్యం ఎంత తగ్గుతూ ఉంటే వారి శరీరంలో ఆత్మ యొక్క ప్రాముఖ్యం అంత పెరుగుతూ ఉంటుంది. అలా పెరిగినప్పుడు ఆత్మ నుండి అపరోక్ష జ్ఞానం పొందగలుగుతారు. ఇక్కడ ఈ రెండిటికీ పత్రి గారు ఉదాహరణలు ఇచ్చారు.

ఏమిటంటే? చంద్రుడు స్వయం ప్రకాశకుడు కాదు. పౌర్ణమి రోజు చంద్రుడి ప్రకాశం ఎంతో గొప్పగా ఉంటుంది. ఆ రోజు అర్ధరాత్రి బయటకి వచ్చి చూస్తే అన్నీ కనిపిస్తూనే ఉంటాయి. ఎందుకు కనిపిస్తాయంటే? ఆ చంద్రుడి యొక్క ప్రకాశం. కానీ అంతలా ప్రకాశిస్తున్నాడు అంటే అది ఆయన ప్రకాశం కాదు, సూర్యుడి యొక్క ప్రకాశం వల్లే ఆయనకి అంత ప్రకాశం ఉంటుంది.

మరి ఆ పౌర్ణమి ప్రకాశం అస్తమాను ఉంటుందా? అంటే ఉండదు. తగ్గిపోయి అమావాస్య వచ్చి అక్కడ పూర్తి చీకటిగా ఉంటుంది. నిజంగా చంద్రుడికి స్వయం ప్రకాశం ఉంటే సూర్యుడు లాగే ఎప్పుడూ ప్రకాశిస్తూ ఉంటాడు.

అంతేగానీ కొన్ని రోజులు ప్రకాశంతో, కొన్ని రోజులు ప్రకాశం

లేకుండా చీకటితో ఉండదు. అంటే చంద్రుడు అప్పుడప్పుడు మాత్రమే ప్రకాశించే వాడు. చంద్రునికి పౌర్ణమి మరియు చంద్రకళలు ఉంటాయి.

ఇక్కడ చంద్రప్రకాశంతో జీవించేవాడికి ఒకప్పుడు జీవితం బాగుంటుంది, ఒకప్పుడు జీవితం బాగా ఉండదు. వీళ్ళనే చంద్రవంశీకులని పత్రి గారు నిర్వచనం ఇచ్చారు. వీళ్ళు జీవితంలో ధ్యానాభ్యాసం ఇంకా ప్రారంభం చేయని వాళ్ళు. ఇంకా మొదలు పెట్టలేదని చెప్పుకోవచ్చు.

వీళ్ళు పుస్తకాలు బాగా చదువుతారు, అలాగే సాయంత్రం ముగ్గురు, నలుగురు కూర్చుని డిస్కషన్ చేస్తారు. మేము సజ్జన సాంగత్యం చేశామంటారు. వీళ్ళు ఈ "శ్వాస మీద ధ్యాస" సాధన చేయరు. ఆ పుస్తకాల ద్వారా తెలుసుకుని అబ్బో మేము చాలా తెలుసుకున్నాం, చాలా జ్ఞానం ఉంది అనుకుంటారు. ఇలాంటి వాళ్ళని చంద్రవంశీకులుగా చెప్పుకోవచ్చు అని పత్రిగారు అన్నారు.

కానీ ఎవరయితే స్వాధ్యాయం, సజ్జన సాంగత్యం చేస్తూ వాటితో పాటు స్వీయ ధ్యాన అభ్యాసానికి అత్యధికంగా అంకితమై ఉంటారో వారు స్వయం ప్రకాశకులుగా మారతారు. వాళ్ళనే సూర్యవంశీకులు అంటారు.

ఇప్పుడు ఎవరైతే సంవత్సరాల తరబడి భీమవరం క్లాసులకి వస్తున్నారో, మార్నింగ్ జూమ్ లో కూడా పాల్గొంటున్నారో, వాళ్ళందరినీ కూడా మనం సూర్యవంశీకులుగా చెప్పుకోవచ్చు. ఎందుచేతనంటే వీళ్ళు మెల్లి మెల్లిగా అపరోక్ష జ్ఞానాన్ని సంపాదించుకుంటారు.

ఊరికే పుస్తకాలు చదివి ఏదో నలుగురు కూర్చుని ఆ పుస్తకాల్లో చదివిన దాన్ని డిస్కస్ చేస్తే వాళ్ళు చంద్రవంశీకులే. వాళ్ళని క్లాసు విడిగా చెప్పమంటే ఏం చెప్పలేరు చెప్పినా సగం తప్పులుంటాయి. ఏదో గొప్ప కోసం చెబుదామనుకుంటారు కానీ వారు తెలుసుకున్న దానికి అదనంగా వీళ్ళ సొంత జ్ఞానాన్ని చెబుదామనుకుంటే ఉపయోగం ఉండదు.

అందరూ ఇంత ధ్యానం చేస్తున్నాము ఏం లాభం వచ్చింది? అని ఆలోచిస్తారు కానీ ఆ గొప్పవాళ్ళలా, ఒక పత్రిగారి లాగా, ఒక బుద్ధుడిలా,

రమణమహర్షిలాగా, వివేకానందలా మనం బోధించగలుగుతున్నామా! అన్నదే మీరు గమనించుకోవాలి.

నేను పత్రిగారి విషయంలో ఆశ్చర్యపోయాను. ఏదో ఒక పాయింట్ తీసుకుంటారు ఒక గంట కూడా క్లాస్ చెప్పేస్తారు. ఎలా చెప్తున్నారు ఈయన? అనుకునేవాడిని. అస్తమాను చెప్పినవే చెప్తూ ఉంటే జనాలకు బోర్ కొడుతుందని ఆయన క్లాసు మొదలు పెట్టే ముందు ఎంతమంది రానివ్వండి కొంతమందిని పిలిచి మాట్లాడమనేవారు. వాళ్ళు మాట్లాడేటప్పుడు కొన్ని కొన్ని విషయాలు చెప్తూ ఉంటే, ఆ విషయాల్లోంచి కొంచెం బాగున్నవి, ఎదుట వాళ్ళని ఆకర్షించే పాయింట్లు తీసుకుని వాటి మీద గంట అనర్గళంగా చెప్పేవారు.

అంతకు ముందు ఆ టాపిక్ చెబుదామని ఆయన అనుకోరు. ఈ మాట్లాడించడంలో ఒక పాయింట్ ని పట్టుకుంటారు. అప్పుడు నాకు అర్థమైంది, ఏం చెప్పాలో మీకు అర్థం కానప్పుడు మీరు సూర్యవంశీకులైతే అక్కడ కొంతమందితో మాట్లాడించి దాంట్లో ఒక పాయింట్ పట్టుకొని మీరు చెప్పినట్లయితే మీరు స్వయం ప్రకాశికులు, సూర్యవంశీకులు అయినట్టే.

ఆయన ఇంకా ఏమన్నారంటే సరైన సిద్ధాంతం తెలుసుకున్నవారు చంద్రవంశీకులు. అంటే వాళ్ళు గొప్ప గొప్ప వాళ్ళు చెప్పిన విషయాలు పుస్తకాలు చదివి బాగా తెలుసుకుంటారు. బుద్ధి బాగా పెరిగినప్పుడు వారు గ్రహించి, దాన్ని ఇతరులకి బాగా వివరించగలుగుతారు. కానీ ఎవరైతే ఆ రెండూ చేస్తూ, దానితో పాటు సరైన ధ్యాన అభ్యాసం తీవ్రంగా చేస్తారో వాళ్ళు సూర్య వంశీకులుగా వెలిగి తీరుతారు అన్నారు.

పత్రి గారు ఇంకా ఏమన్నారంటే "ఆవగింజంత విశ్వాసం ఉన్నా పర్వతాలను సైతం కదిలించగలం" అని ఏసుప్రభువు చెప్పిన సందేశాన్ని ఇక్కడ పేర్కొన్నారు.

అటువంటి ఆవగింజంత విశ్వాసం, కొద్దిపాటి విశ్వాసం మన పట్ల మనకు, అలాగే మనం చేసే "శ్వాస మీద ధ్యాస" పట్ల మనకు ఉంటే

అనేకానేక ఆధ్యాత్మిక పర్వతాలను నిశ్చయంగా అధిరోహించ గలుగుతారు, స్వయం ప్రకాశకులుగా మారతారు, అలాంటి వారే గురువులుగా వెలుగుతారు.

అందుకే మీరు చూడండి మన దగ్గరికి ఎంతో మంది వస్తున్నారు. అందులో చాలామంది క్లాసులు కూడా చెప్తున్నారు. కొంతమంది రెండు సంవత్సరాలు, మూడు సంవత్సరాలు కూడా ఉంటారు. కానీ అలాగే ఉండిపోతున్నారు. వాళ్ళకి విశ్వాసం లేదు, నా వల్ల ఎక్కడ అవుతుంది? అనుకుంటారు. కొంతమంది బాగా చెబుతుంటే వాళ్ళకి ఏదో పూర్వజన్మ సంస్కారం ఉండి ఉంటుంది అందుకే అలా చెప్పగలుగుతున్నారు అనేటటువంటి భావం వారిలో ఉంటుంది.

అంటే నేను చెప్పగలను అనే విశ్వాసం వాళ్ళకి లేదు. అందుకే ఎన్ని సంవత్సరాలైనా అలా వింటూ ఉండిపోతారు కానీ వారిలో మార్పు రాదు, ఎదుగుదల ఉండదు. వాళ్ళు ఏం చెప్పాలన్నా పరుల ద్వారా పొందిందో, లేదా ఆ పుస్తకాలు చదివో, ఆ వీడియోలు వినో చెప్తారు. అలా పరుల ద్వారా జ్ఞానాన్ని పొందిన వారంతా శిష్యులు గానే మిగిలిపోతారు.

అందుచేత మీరు ఏదో ఒక పాయింట్ తీసుకోండి దాని మీద గంటో, రెండు గంటలో క్లాస్ చెప్పడానికి ప్రయత్నించండి. అప్పుడు మీరు సూర్యవంశీకులు అయినట్టే! మీరు గురువులు అయినట్టే లెక్క.

లోకంలో ఈ ఇద్దరు కాకుండా ఆ పర ప్రకాశంతో కూడా జీవించని వాళ్ళు, అంధకారంలో మగ్గుతున్న వాళ్ళు కూడా ఉన్నారు. అంటే ఇక్కడ మనకు మూడు రకాల వారు కనిపిస్తున్నారు. స్వీయ ప్రకాశంతో జీవించేవాళ్ళు, పర ప్రకాశంతో జీవించేవాళ్ళు, ఆ పర ప్రకాశంతో కూడా జీవించని వాళ్ళు. ఈ మూడో వాళ్ళు అంధకారంలో మగ్గిపోతారు.

అందుచేత ఎవ్వరూ కూడా శిష్యులుగా ఉండిపోకూడదంటే పరప్రకాశంతో జీవించడం కాదు, అంటే పరులు బోధించింది బోధించడం కాదు, నేర్చుకోవడం కాదు. అలా జీవిస్తే వాళ్ళు శిష్యులుగానే ఉండిపోతారు.

అందుచేత మానవులు కూడా గురువులుగా, స్వయం ప్రకాశకులుగా, పరిపూర్ణులు అవ్వాలన్నదే పి.ఎస్.ఎస్.ఎం యొక్క ప్రధాన సిద్ధాంతం అంటే లక్ష్యం.

అందుచేత ఎవరైతే స్వాధ్యాయం, సజ్జన సాంగత్యాదులు మాత్రమే చేస్తారో వారు పరోక్ష జ్ఞానం పొందుతారు. కానీ ఎవరైతే ఈ రెండింటితో పాటు అకుంఠిత ధ్యాన సాధన చేసి అపరోక్ష జ్ఞానం పొందుతారో వారు స్వీయ ప్రకాశకులుగా ఎదుగుతారు, పరిపూర్ణులు అవుతారు.

పత్రిగారు చివరికి ఏం చెప్పారంటే ప్రప్రథమంగా అందరూ స్వాధ్యాయం, సజ్జన సాంగత్యం విశేషంగా చేస్తూ చంద్రవంశీకులుగా ఉన్నా అకుంఠిత దీక్షతో ధ్యాన సాధన చేస్తే క్రమక్రమంగా సూర్యవంశీకులుగా ఎదుగుతారు అన్నారు.

ఆఖరిగా పత్రిగారు చంద్రవంశీకులైన వారికి అభినందనలు. సూర్యవంశీకులైన వారికి శతకోటి సూర్య నమస్కారాలు అన్నారు. కనుక ప్రతి ఒక్కరూ సూర్యవంశీకులుగా విరాజిల్లండి. ఈ మార్గంలోకి వచ్చిన వాళ్ళు తెలుసుకోవాల్సింది ఇదే.


**తటవర్తి దంపతుల YouTube ఛానెల్ Subscribe చేసుకోవాలంటే**

a) Whatsapp group లో మీకు పంపబడుతున్న Youtube లింక్ మీద నొక్కినప్పుడు Tatavarthy Veera Raghava Rao ఛానెల్ open అవుతుంది. Open అవ్వగానే subscribe కనిపిస్తుంది. దాని మీద నొక్కితే subscribe అవుతారు. ప్రక్కనే వున్న bell button నొక్కితే ప్రతీ రోజు వచ్చే వీడియోలు చూడవచ్చు.

లేకపోతే www.tst.org.in/videos/ ఓపెన్ అయిన తరువాత I లో Tatavarthy Veera Raghava Rao పేరు మీద నొక్కండి. II & III లో వున్న పేరు మీద నొక్కండి. ఛానెల్స్ Open అవుతాయి. Open అవ్వగానే subcribe కనిపిస్తుంది. దాని మీద నొక్కితే subscribe అవుతారు. ప్రక్కనే వున్న bell button నొక్కితే ప్రతీ రోజు వచ్చే వీడియోలు చూడవచ్చు.

# తటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

| | |
|---|---|
| 1) జీవితశాస్త్రం (మొదటి భాగం) | - రూ.130/- |
| 2) జీవితశాస్త్రం (రెండవ భాగం) | - రూ.130/- |
| 3) జీవిత సత్యాలు | - రూ.130/- |
| 4) సత్యమార్గం | - రూ.160/- |
| 5) ధ్యాన శక్తి | - రూ.130/- |
| 6) ధ్యాన శాస్త్రం | - రూ.130/- |
| 7) ఆత్మ శాస్త్రం | - రూ.120/- |
| 8) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం | -రూ.160/- |
| 9) మరణించకముందే మరణించాలి | - రూ.130/- |
| 10) జీవిత సూక్ష్మాలు | - రూ.130/- |
| 11) "గైడింగ్" ధ్యానం ఎందుకు కాదు? | - రూ.120/- |
| 12) గీతాసందేశం | - రూ.120/- |
| 13) ఉపమాన ధ్యాన సందేశాలు | -రూ.110/- |
| 14) భగవంతుడంటే | - రూ.100/- |
| 15) తెలుసుకోండి | - రూ.100/- |
| 16) మెహర్‌బాబా సందేశాలు | - రూ.100/- |
| 17) మరణం తర్వాత జరిగేది తెలుసుకుంటే కలిగే లాభాలు | - రూ.100/- |
| 18) పత్రీజీ చెప్పిన శ్వాస మీద ధ్యాసా? పత్రీజీ చేయించిన మ్యూజిక్ మీద ధ్యాసా? ఏది సరైన ధ్యానం? | - రూ.100/- |
| 19) కోరికల వల్ల నష్టాలు | - రూ.100/- |
| 20) శంకరాచార్యుల వారి జ్ఞాన సందేశాలు | - రూ.100 |
| 21) కఠోపనిషత్తు | - రూ.90/- |
| 22) ఉపమాన జ్ఞాన సందేశాలు | -రూ.90/- |
| 23) కర్మ సిద్ధాంతం | - రూ.80/- |
| 24) ధ్యానమంటే ? | - రూ.80/- |
| 25) త్రివిధాలు | - రూ.80/- |
| 26) ఉత్తమ పురుషుడు | - రూ.80/- |
| 27) శాస్త్రాల అర్థం-అంతరార్థం | - రూ.70/- |
| 28) ఆత్మజ్ఞానం ఎందుకు? | - రూ.70/- |
| 29) జ్ఞాన జ్యోతి | - రూ.70/- |
| 30) జ్ఞాన కుసుమాలు | - రూ.70/- |
| 31) మరణం తర్వాత కూడా వచ్చేవి | - రూ.70/- |
| 32) షిరిడీ సాయి సందేశాలు | - రూ.70/- |
| 33) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య | - రూ.70/- |
| 34) బుద్ధుని సందేశాలు | - రూ.70/- |
| 35) భూతదయే దైవత్వం | - రూ.70/- |
| 36) ఆత్మహంతకులంటే ఎవరు? | - రూ.70/- |
| 37) స్త్రీ జన్మల్లో నేర్చుకునేవి, పురుష జన్మల్లో నేర్చుకునేవి | - రూ.70/- |
| 38) ధర్మ సూక్ష్మాలు | - రూ.70/- |
| 39) ఆశ్చర్యకరమైన విషయాలు | -రూ.70/- |
| 40) దుఃఖ నివారణామార్గం | - రూ.60/- |
| 41) బ్రహ్మజ్ఞానం | - రూ.60/- |
| 42) ధ్యానం (పత్రీజీ) | - రూ.60/- |
| 43) ధ్యానం వల్లనే జ్ఞానం | - రూ.60/- |
| 44) అతీంద్రియ శక్తులు | - రూ.60/- |
| 45) ఆలోచించండి | - రూ.60/- |
| 46) నిర్వాణ మార్గం | - రూ.60/- |
| 47) ధ్యానులకు సూచనలు | - రూ.60/- |
| 48) యోగీశ్వరుల సందేశాలు | - రూ.60/- |
| 49) సంకల్పమంటే? | - రూ.50/- |
| 50) ఈ జీవితం ఎందుకు? | - రూ.50/- |
| 51) ఆశ్చర్యం... ఆశ్చర్యం | - రూ.50/- |
| 53) మూడురకాల భవిష్యత్తులు | -రూ.50/- |
| 54) మూడురకాల జీవితాలు | -రూ.40/- |
| 55) ఆర్థిక పరిస్థితి పెంచుకోవాలంటే | - రూ.40/- |
| 56) ఛాంపియన్ అవ్వాలంటే? | -రూ.40/- |
| 57) బ్రహ్మం అంటే? | -రూ.40/- |
| 58) శంకరాచార్యుల వారి జాగ్రత పంచకం | -రూ.40/- |
| 59) శంకరాచార్యుల వారి నిర్వాణ షట్కం | -రూ.40/- |
| 60) మహాత్ముల సందేశాలు | - రూ.40/- |
| 61) సత్యం | - రూ.40/- |
| 62) చక్రాలు | - రూ.40/- |
| 63) గురువును గుర్తించడం ఎలా? | - రూ.40/- |
| 64) భాగవత సన్నివేశాల అంతరార్థం | - రూ.40/- |
| 65) మౌన ధ్యానం | - రూ.40/- |
| 66) మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా? | -రూ.20/- |
| 67) శాకాహారమే మానవాహారం | - రూ.15/- |
| 68) అహింస మరియు శాఖాహారం | - రూ.15/- |

పుస్తకముల కొరకు : **తటవర్తి వీర రాఘవరావు**, తటవర్తివారి వీధి,
భీమవరం-1. ప॥గో॥జిల్లా. ఆం.ప్ర. సెల్: 9440309812,



మానవుడికి మూడు రకాల జీవితాలు ఉంటాయి. ఈ మూడూ కూడా మానవుని యొక్క జ్ఞాన పరిధిని సూచించేవే. మరి ఈ మూడు రకాల జీవితాలు జీవించే వారి గురించి చెప్పుకుందాం. అసలు ఏమిటి ఆ మూడు రకాలు?

1) రాత్రి జీవితం, 2) సంధ్యా జీవితం, 3) పగటి జీవితం.

రాత్రి జీవితము అంటే పూర్తిగా అజ్ఞానంతో ఉన్నటువంటి జీవితం. అందుకే అజ్ఞానాన్ని చీకటితో పోలుస్తారు. చీకట్లో ఉన్నవి ఎలా కనిపించవో, అజ్ఞానంలో ఉన్నవారికి ఉన్నవి కనిపించవు అంటే తెలియవు.

సంధ్యా జీవితంలో జ్ఞానం పొందుతారు. జ్ఞానం మీద ఆసక్తి ఉంది. కానీ ఆ జ్ఞానం గురించి చెప్పిన విషయాలు పూర్తిగా అర్థం కాకపోవడం వల్ల లేదా భయం వల్లా ఆచరణ ఉండదు.అన్నీ తెలుసు, కానీ ప్రవర్తనలో మార్పు రాదు. మరి తెలిసున్నా కూడా ఆచరించకపోతే, మార్పు తెచ్చుకోకపోతే సంధ్యా జీవితంలో ఉన్నట్టే.

పగటి జీవితం అంటే ఇది పూర్తిగా జ్ఞానం పొందినవారి జీవితం. ధ్యాన సాధన తీవ్రంగా చేయడం వల్ల, వీరి జ్ఞానం అపారంగా పెరుగుతుంది, అగ్నిలా ప్రజ్వరిల్లుతుంది. అటువంటి జ్ఞానాగ్నిలో వీరు కర్మలను కూడా దగ్ధం చేసుకుంటారు, ముక్తిని, మోక్షాన్ని కూడా పొందుతారు.

రూ.40/-

- బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు